S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక    తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 99 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 31 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## హార్వర్డ్ వర్సిటీలో సీఎం శిక్షణ

వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి



## పెళ్లి పేరుతో అవమానాలు వేధింపులు

తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. 2లో

## దానం అనర్హతపై స్పీకర్ విచారణ

- కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్
- సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరెడ్డి
- 18న విచారణకు హాజరు కావాలని గడువు





పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. 2



## టెట్ 'కీ' విడుదల 3లో



4

## బంగారం.. తిరోగమనం

భారీగా తగ్గిన ధరలు..

## ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి

3



## వనదేవతల వైభవం

- మేడారంలో భక్తి పారవశ్యం
- క్యూ కట్టిన కోట్లాది భక్తజనం..
- తరలివచ్చిన గవర్నర్, మంత్రులు!



మేడారం మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. "వన దేవత.. మన దేవత.. జన దేవత" అంటూ అపార విశ్వాసంతో దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారానికి తరలివస్తుండటంతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి పూజలు నిర్వహించగా, డీజీపీ శివధర్ రెడ్డి, తదితరులు తల్లులను దర్శించుకున్నారు.

.. వివరాలు 3లో



## తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

### పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు

హరీష్‌రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి

పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్

మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

" కేంద్ర జలసంఘం చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. "

**హైదరాబాద్, జనవరి 30:** పోలవరం – బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వ లేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరో పించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని మిగతా 2 లో

## పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి

కమిటీ ముందు తెలంగాణ డిమాండ్

జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ 2






2

## మరోమారు కేసీఆర్‌కు షాక్

ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ

**ఆదివారం నందినగర్‌లోని నివాసంలోనే విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీసులు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ అధికారులు మరోసారి షాక్ ఇచ్చారు. తనను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను తోసిపుచ్చిన అధికారులు, ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలోనే విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీసులిచ్చారు.



## బాపూజీకి ఘన నివాళి

- మహాత్మాగాంధీ 78వ వర్ధంతి
- రాజ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి, ప్రధాని నివాళి
- నివాళి అర్పించిన చంద్రబాబు

వివరాలు 4వ పేజీలో



4

## రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

బావమరిదికి ఫోన్ చేసి భార్యను చంపిన దుర్మార్గుడు

స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు




# హార్వర్డ్ వర్సిటీలో సీఎం శిక్షణ

## వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి

**హైదరాబాద్, జనవరి 30:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# ఎడ్‌సెట్‌కు టీ-సాట్ బూస్ట్

## ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, జనవరి 30:** టీఉసాట్ నెట్‌వర్క్ ఛానళ్ల ద్వారా ప్రసారం కానున్న ఎడ్‌సెట్ కోచింగ్ షెడ్యూల్ పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సచివాలయంలో ఆవిష్కరించారు. టీఉసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డితో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎడ్‌సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు టిఉసాట్ అందించే డిజిటల్ కంటెంట్‌ను బీఈడీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి మే 11 వరకు రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. బయాలజీ, ఫిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులతో 98 రోజుల పాటు టిఉసాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టిఉసాట్ యాప్, యూట్యూబ్‌లో కూడా ప్రసారాలు కొనసాగుతాయని తెలిపారు. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందిస్తున్నందుకు టిఉసాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఉసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎండీ సాధిక్ పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో వేధింపులు.. అవమానాలు

## తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**వరంగల్, జనవరి 30:** ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అనితను తొర్రూరు మండలానికి చెందిన దూరపు బంధువు రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. ఇటీవల అనిత డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమని చెప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నావంటూ రాజేందర్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. అతని వేధింపులు తట్టుకోలేక అనిత తన తల్లిదండ్రులతో చెప్పి బాధపడింది. రాజేందర్ పద్ధతి నచ్చక, తమ కూతురుని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తేల్చి చెప్పారు. అయినా అనితను పెళ్లి చేసుకుంటానంటూ బతిమలాడుతూనే ఉన్నాడు. మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్ లాల్‌ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఇద్దరూ పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని భావించారు. ఇటీవల జబ్బార్ కూడా మోసగాడని తేలింది. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని పదేపదే వేధించడం మొదలు పెట్టాడు. జబ్బార్ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి 'నువ్వు, జబ్బార్ నా జీవితంతో ఆడుకున్నారు, నన్ను వేధించారు, అవమానించారు, మీ వల్లనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ బాధపడింది. అనితకు ధైర్యం చెప్పాల్సిన రాజేందర్ నిర్లక్ష్యంగా 'చావు.. నీ ఇష్టం' అంటూ ఫోన్ కట్ చేశాడు. దాంతో అనిత తీవ్ర మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అనిత కన్నుమూసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రాజేందర్, జబ్బార్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

మొదటి పేజీ తరువాయి



అన్నారు. ఢిల్లీ సమావేశం గురించి హరీశ్‌రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి.. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి పూర్తి చేయలేదు.. డిండి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. పదే పదే అబద్దాలు చెప్పి? నిజం చేయాలని అనుకుంటున్నారు.. పదేళ్ల లో కంటే ఈ రెండేళ్లలో ఎక్కువ నీటి వినియోగం, వరి దిగుబడి వచ్చిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

# పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి

## కమిటీ ముందు తెలంగాణ డిమాండ్

## జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ



**న్యూఢిల్లీ, జనవరి 30:** కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు 2 గంటలపాటు భేటీ జరిగింది. అజెండాలో 12అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ అధికారులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ ఛైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్- వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

# మరోమారు కేసీఆర్‌కు సిట్ షాక్

- ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం 3గంటలకు విచారణకు సిద్దంగా ఉండాలని నోటీస్
- న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు




**హైదరాబాద్, జనవరి 30:** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న (గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్‌కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్‌లోనే ఎలాంటి నోటీసులైనా.. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్ అడ్రస్‌కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

# దానం అనర్హతపై స్పీకర్ విచారణ

## కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్

## సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరరెడ్డి

## 18న విచారణకు హాజరు కావాలని గడువు



**హైదరాబాద్,జనవరి 30:** పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. దానంపై అనర్హత వేటు వేయాలని పాడి కౌశిక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దానం తరఫున న్యాయవాదులు కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?.. పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై పాడి కౌశిక్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నుంచి దానం పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడం, దానం ప్రచార ఫొటోలు, వీడియోలు.. దానం కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్ ముందు ఉంచారు పాడి కౌశిక్ రెడ్డి. దీంతో స్పీకర్ ఎదుట పాడి కౌశిక్ రెడ్డి విచారణ ముగిసింది. ఇక, దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సాక్ష్యాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాదులు.. స్పీకర్ ముందు హాజరయ్యారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు ఎవిడెన్స్ అఫిడవిట్‌ను పొందుపరిచానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా హాజరుకాలేనని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలంటే సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 20 తరువాత సమయం ఇస్తే తాను విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని అఫిడవిట్‌లో మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న స్పీకర్ విచారించనున్నారు. ఇక, పార్టీ ఫిరాయింపుల కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ పది మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు రాగా.. ఎనిమిది మందికి సంబంధించిన విచారణ పూర్తి అయ్యింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణ జరగాల్సి ఉండగా... దానంను స్పీకర్ విచారించారు. దానం చెప్పే విషయాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ సమయంలోనూ ఇదే జరిగింది. విచారణ సమయంలో ఏ పార్టీలో ఉన్నారనే విషయాన్ని ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రశ్నించగా.. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఇక దానం నాగేందర్ కూడా మొన్నటి వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అవసరమైతే ఉపఎన్నికకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే గత రెండ్రోజులుగా దానం యూటర్న్ తీసుకున్న పరిస్థితి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ తనపై అనర్హత వేటు వేస్తే.. ఉపఎన్నికకు సిద్ధమని దానం పదేపదే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

- చంద్రబాబుతో దోస్తీతో ఏపీకి లైన్ క్లియర్
- నల్లమల సాగర్ ప్రాజెక్ట్ కోసం నాటకాలుడుతున్న రేవంత్
- ఇరిగేషన్ మీటింగ్ బాయ్‌కాట్ చేయడం ఒక్కటే మేలు
- రేవంత్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్న హరీష్ రావు



**హైదరాబాద్, జనవరి 30:** ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నడని హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో దోస్తీ కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కేంద్రానికి 10 డీపీఆర్‌లు పంపి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ఒక్క అనుమతి కూడా తేలేదని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లేందుకు ఆదిత్యనాథ్ మినహా తెలంగాణ సోయి కలిగిన ఒక్క ఇంజినీర్ దొరకలేదా..?' అని హరీష్‌రావు ప్రశ్నించారు. మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోనుపోను అంటూనే మీటింగ్‌లకు అటెండ్ కావడం ఏమిటి..? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమే మీ చర్చల లక్ష్యమా..?' అని ప్రశ్నించారు. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. ఇవాల్టి ఇరిగేషన్ మీటింగ్ ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు మ-రణశాసనం రాయబోతున్నదని చెప్పారు. పోలవరం నల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరును ఒకసారి గమనించండి. పోను పోను అనుకుంటూనే నాడు డిల్లీ మీటింగ్‌కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకంపెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాశాడు. వేయను అంటూనే కమిటీవేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్ళి నల్లమలసాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతు ప్రకటించాడు' అని రేవంత్ కుట్రలను వెల్లడించాడు. చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో ఇవాళ జరుగుతున్న ఢిల్లీ మీటింగ్‌లో ఇంజినీర్లు పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ నీటిని ఒడిసిపట్టిండ్రని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి విడిచిపెట్టిండని హరీష్‌రావు మండిపడ్డారు. ఏపీ పాలకులతో కలిసి తెలంగాణకు జలద్రోహం చేస్తున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20 లక్షల ఎకరాలు మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బీఆర్‌ఎస్ సాధించింది' అని మాజీ మంత్రి చెప్పారు. 'బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మానుకుంటే మంచిది. కేంద్రంలోని మీ ప్రభుత్వమే తెలంగాణ ప్రగతిపథాన్ని వివరించింది. కళ్లు తెరవండి అనవసరంగా బీఆర్‌ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి' అని హరీష్‌రావు బీజేపీ నేతలకు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలకులకు ఢిల్లీకి, దావోస్‌కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సేద్యంపై దృష్టిసారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని ఆరోపించారు.



# వనదేవతల వైభవం

- మేడారంలో భక్తి పారవశ్యం
- క్యూ కట్టిన కోట్లాది భక్తజనం..
- తరలివచ్చిన గవర్నర్, మంత్రులు!



**మేడారం, జనవరి 30 :** మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. ఇప్పటికే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ జాతరకు హాజరై.. వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కారు అద్దాలతో పాటు స్థానిక షాపులను భక్తులు ధ్వంసం చేశారు. అలాగే భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమ్మక్క-సారలమ్మ తల్లులను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దర్శించుకుని, నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.









# ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్

## బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నా ను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్‌ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మతమార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

# తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదల

**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదలైంది. టెట్ 2026 జనవరి కీ, రెస్పాన్స్ షీట్‌లను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. టెట్ 'కీ'పై అభ్యంతరాలను నేటి నుంచి ఫిబ్రవరి 1న సాయంత్రం 5గంటల వరకు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. తెలంగాణ టెట్ పేపర్ 1, పేపర్ 2కు కలిపి దాదాపు 2.37లక్షల దరఖాస్తులు రాగా.. వీటిలో 71,670మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారు. మరిన్ని వివరాలను టెట్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపింది.

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

## అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి

## వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సీఎస్ సమీక్ష

**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ విజన్ 2047 లక్ష్యాలను చేరుకోవడానికి అన్ని ప్రభుత్వ శాఖలు నిర్దేశిత ప్రణాళికతో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా వివిధ విభాగాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఆయన, శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ, మత్స్య, అటవీ, పౌర సరఫరాలు మరియు కార్మిక శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రైతు సంక్షేమానికి పెద్దపీట రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులో యూరియా, ఎరువుల పంపిణీని ఐటీ ఆధారిత సేవల ద్వారా పటిష్టం చేయాలని సి.ఎస్ సూచించారు. ఆయిల్ పామ్ సాగు, పండ్లు, కూరగాయల పెంపకాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందస్తుగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పాడి, మత్స్య రంగాల బలోపేతం పశువైద్య సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని, పశువుల వ్యాధుల నివారణకు టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సి.ఎస్ పేర్కొన్నారు. పాల సేకరణ సామర్థ్యాన్ని పెంచి, చిన్న పాడి రైతులకు లాభదాయకమైన విధానాలు రూపొందించాలని సూచించారు. మత్స్యశాఖ సమీక్షలో భాగంగా.. మల్లన్న సాగర్, కొండపోచమ్మ వంటి జలాశయాల్లో చేపల పెంపకంపై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. పర్యావరణం, అటవీ సంరక్షణ అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణపై సమీక్షించిన సీఎస్.. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. హరిత నిధి, ఎకో టూరిజం, అర్బన్ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే, పౌర సరఫరాల శాఖ ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, రేషన్ దుకాణాల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కార్మిక మరియు ఉపాధి శాఖల సమీక్షలో భాగంగా.. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి విదేశాల్లో ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, బి.ఎమ్.డి. ఎక్కా, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## సంపాదకీయం

# వాస్తవ పరిస్థితులను బడ్జెట్ గుర్తించేనా?

ఏటేటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టడం, దానిపై పెద్దగా పట్టింపు లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టడం..తూతూ మంత్రంగా సాగిపోతోంది. దేశంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రావడం లేదు. మూడో ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతోంది. నిజం చెప్పాలంటే ప్రజలను మభ్యపెట్టడబం తప్ప, వాస్తవాలను పాలకులు గ్రహించడం లేదు. ప్రపంచ ఆర్థిక మాంద్యం తరుముకు వస్తున్న వేళ దేశీయంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. యువతకు చేతినండా పిన కల్పించడం, ధరలను అదుపు చేయడం, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం వంటి చర్యలను గుర్తించడం లేదు. అమెరికా వీసాల కట్టడితో మనదేశం నుంచి వెళుతున్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అక్కడా ఉద్యోగాల కల్పన అన్నది భ్రమగా మారింది. ప్రపంచంలో డాలర్ పతనం ప్రారంభం అయ్యింది. ఈ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ట్రంప్ సుంకాల కారణంగా మాన మార్కెట్లు కుదేలవుతున్నాయి. దీనిపైనా ముందస్తు వ్యూహం ఉండాలి. చెప్పాలంటే ప్రతికూల పరిస్థితుల్లో దేశం ముందుకు వెళ్లే ప్రయత్నాలు సాగాలి. మన ఉత్పత్తులను మనం ఉపయోగించే పరిస్థితి రావాలి. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వస్తూత్పత్తిని పెంచుకోవచ్చు. ధాన్యం దిగుబబడులకు అనుగుణంగా మార్కెట్ లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో ఎప్పుడూ చర్చించడం లేదు. ప్రస్తుతం అంటే ఫిబ్రవరి1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో చర్చిస్తారా అన్నది చూడాలి. మనకున్న సహజ వనరులను, మానవనరులను ఎలా జోడించి వినియోగించుకోగలమో అన్న ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలు సాగుతున్నాయి. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్నట్లు జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థే 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది. ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ఎకనామిక్ సర్వేను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం లో భారతదేశపు ఎకానమీ 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతుండటం విశేషం. మన దేశ సంభావ్య వృద్ధి రేటు సుమారు 7 శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది. దేశీయ డిమాండ్.. వృద్ధికి వెన్నెముక ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన బఫర్స్ భారత్ వద్ద ఉన్నాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధి రేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా ఆర్థిక సర్వే ఆశాజనక సూచనలు చేసినా, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధ పరిస్థితి ఉంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పేదరికం ఇంకా పెరుగుతోంది. వీటిని సమీక్షించాల్సిన అసవరం ఉంది. ఆ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు రావాలి. సమస్యలను చర్చించి, అధిగమించే ప్రయత్నాలు చేపట్టాలి. అప్పుడే ఆర్థికంగా దేశం బలోపేతం కాగలదు.



# బాపూజీకి దేశం ఘన నివాళి

- మహాత్మాగాంధీ 78వ వర్ధంతి
- రాజ్‌ఘాట్ వద్ద రాష్ట్రపతి, ప్రధాని నివాళి
- నివాళి అర్పించిన చంద్రబాబు



**న్యూఢిల్లీ, జనవరి 30:** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు. మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకులు, సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం, విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించు కున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు. జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్ర్యం సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

## వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ

## అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత



**న్యూఢిల్లీ, జనవరి 30:** నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.



# బంగారం.. తిరోగమనం


## భారీగా తగ్గిన ధరలు.. ● రూ.1,80,779 దగ్గర ట్రేడ్

**న్యూఢిల్లీ, జనవరి 30:** కొన్ని రోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. గురువారం ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయికి చేరిన బంగారం, వెండి ధరలు శుక్రవారం అథ:పాతాళానికి పడిపోయాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్ మార్కెట్‌లో 1,80,779 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కిలో వెండి ధర రూ.4,20,048 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు ఊహించని విధంగా ధరలు భారీ స్థాయిలో పతనమయ్యాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ.15,246 తగ్గింది. ప్రస్తుత ధర రూ. 1,54,157 ఉంది. వెండిపై ఏకంగా రూ. 67,891లు తగ్గింది. ప్రస్తుత ధర 3,32,002 రూపాయలుగా ఉంది. బంగారం, వెండి ధరలు ఒకే రోజు ఇంతలా పతనమవడానికి కారణం ఇన్వెస్టర్లు భారీ ప్రాఫిట్ బుకింగ్‌కు దిగటమేనని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. ఫ్యూచర్స్‌తో పోలిస్తే ఈటీఎఫ్ ధరలు మరింత పతనమయ్యాయని తెలిపారు. ఫెడ్ తదుపరి చీఫ్‌గా ఆ విభాగం మాజీ అధికారి కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తారన్న వార్తలు కూడా బంగారం, వెండి ధరలు తగ్గటానికి మరో కారణమని అనలిస్టులు అంటున్నారు.

# రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

## బావమరిదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు

## స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు







**న్యూఢిల్లీ, జనవరి 30:** దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పని చేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపు తున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు వినలేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతి చెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో 5రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.



# మహా శివరాత్రి జాతర పోస్టర్ల ఆవిష్కరణ

**సమయం న్యూస్, సిరిసిల్ల:** ఈ నెల 14వ తేదీ నుంచి వేములవా డలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇన్‌చార్జి కలెక్టర్‌కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 15 వ తేదీన మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓ జీ అశోక్ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉంటూ.. వాహనాలను తనిఖీ చేయాలి



## ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సమయం న్యూస్, వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న సంకేపల్లి, జగిత్యాల రోడ్డులో ఉన్న శాత్రాజపల్లి, కోరుట్ల రోడ్డులో కోనాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ చెక్ పోస్టులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, తరలించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్ పోస్టులో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాల వివరాలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఉన్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. వాహనాల తనిఖీ ప్రక్రియ కట్టుదిట్టంగా చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ప్రతి తనిఖీ వివరాలను స్పష్టంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ జయంత్ కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నామినేషన్ కేంద్రాలల్లో అదనపు కలెక్టర్ పరిశీలన

## ఎస్‌ఎస్టీ చెక్ పోస్ట్ తనిఖీ

**సమయం న్యూస్, సిరిసిల్ల/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న ఎస్‌ఎస్టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, నోడల్ అధికారులు నవీన్ కుమార్, శ్రీనివాసాచారి, తహసీల్దార్లు జయంత్ కుమార్, మహేష్ కుమార్, టీపీఓ అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు ఉన్నారు.



# ఎస్‌ఎస్టీ చెక్ పోస్ట్ తనిఖీ చేసిన సాధారణ, వ్యయ పరిశీలకులు

ప్రజానావ, సిరిసిల్ల: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లో ఉన్న సిబ్బంది వద్ద ఉన్న వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 20 లక్షల డబ్బులు సీజ్ చేశామని, తదుపరి విచారణ కోసం పోలీసులకు అప్పగించామని అధికారులు తెలిపారు. తనిఖీలో నోడల్ అధికారులు నవీన్ కుమార్, భారతి తదితరులు ఉన్నారు.



# బీఆర్ఎస్‌లోకి గూడూరి మధు దంపతులు

**సమయం న్యూస్, వేములవాడ:** వేములవాడ పట్టణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న గూడూరి మధు, మాజీ కౌన్సిలర్ గూడూరు లక్ష్మి దంపతులు తిరిగి తమ సొంత గూడైన బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ మధు కుటుంబానికి పార్టీతో మొదటి నుంచి విడదీయలేని అనుబంధం ఉందని, వారు తిరిగి పార్టీలోకి రావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 25వ వార్డు నుంచి బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థిగా గూడూరి మధు పోటీ చేస్తారని ప్రకటించారు. పార్టీ బలోపేతానికి, వార్డు అభివృద్ధికి మధు దంపతుల సేవలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం మధు దంపతులు మాట్లాడుతూ వార్డు ప్రజలకు మరింత చేరువయ్యేందుకే తాము తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఈ చేరికతో వేములవాడ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.



# జాతీయ స్థాయి క్రీడలకు బస్వాపూర్ యువకుడు ఎంపిక

## క్రాస్ కంట్రీ విభాగంలో ప్రతిభ చాటిన యశ్వంత్

## హర్యానాలో జరగనున్న ఆల్ ఇండియా స్పోర్ట్స్ పోటీలకు అర్హత



**సమయం న్యూస్, కోహెడ:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన తాటిపాముల యశ్వంత్ క్రీడారంగంలో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. క్రాస్ కంట్రీ విభాగంలో తన సత్తా చాటి గ్రామానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న యశ్వంత్, చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొంటూ ఈ ఘనత సాధించారు. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ పోటీల్లోని 10 కిలోమీటర్ల విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఫిబ్రవరి 15న హర్యానాలో జరగనున్న 'ఆల్ ఇండియా స్పోర్ట్స్' పోటీల్లో యశ్వంత్ పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యశ్వంత్‌ను కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఆయన సాధించిన విజయం పట్ల స్వగ్రామం బస్వాపూర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ సర్పంచ్‌తో పాటు యువకులు యశ్వంత్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# వరికోలులో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

## అంటరానితనం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## ప్రజలకు అవగాహన కల్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**సమయం న్యూస్, కోహెడ:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వరికోలు గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని (సివిల్ రైట్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు పౌర హక్కుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజు మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనం అనే వివక్షను పూర్తిగా రూపుమాపాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవాలని, అణగారిన వర్గాల పట్ల వివక్ష చూపడం నేరమని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజల్లో మార్పు వస్తుందని, సామరస్య పూర్వకమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజ్ తో పాటు గ్రామ సర్పంచ్ సుధగోని దేవరాజ్, హెడ్ కానిస్టేబుల్ మురళి మోహన్ పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి బాబు, జీపీఓ రాజశేఖర్, ఏఎన్ఎం జ్యోతి, కారోబార్ రాజు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# 12వ వార్డు బీజేపీ అభ్యర్థిగా సాహితీ రాము నామినేషన్

## నివాసం నుంచి భారీ ర్యాలీ.. మద్దతు తెలిపిన వార్డు ప్రజలు

## కేంద్ర పథకాలే నన్ను గెలిపిస్తాయి: సాహితీ రాము

## గత పాలకుల నిర్లక్ష్యంతోనే వార్డు వెనుకబాటు.. అభివృద్ధే నా లక్ష్యం



**సమయం న్యూస్, సంగారెడ్డి:** సంగారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల కోలాహలం మొదలైంది. పట్టణంలోని 12వ వార్డు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కౌన్సిలర్ అభ్యర్థిగా సాహితీ రాము గురువారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నివాసం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వార్డు ప్రజలు, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు. డప్పు చప్పుళ్లు, నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. నామినేషన్ దాఖలు అనంతరం సాహితీ రాము మీడియాతో మాట్లాడుతూ.. తన గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. వార్డు ప్రజల ఆశీర్వాదంతో పాటు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన విజయానికి సోపానాలవుతాయని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా 12వ వార్డు అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, ముఖ్యంగా రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని విమర్శించారు. తాను గెలిస్తే వార్డులో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని, మౌలిక వసతుల కల్పనలో రాజీపడనని హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్సీ నిధులను సద్వినియోగం చేసుకుని కాలనీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. రాజకీయాలకు తాను కొత్త అయినప్పటికీ, ప్రజాసేవ చేయాలనే దృఢ సంకల్పంతోనే బరిలోకి దిగానని, ఒక్కసారి అవకాశం ఇస్తే వార్డు రూపురేఖలు మారుస్తానని సాహితీ రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు భారీగా పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా.

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్.




**వికారాబాద్, జనవరి,30(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా,నిష్పక్షపాతంగా మరియు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు.ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గారు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు లేదా అసత్య ప్రచారాలు చేస్తే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మరియు సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు లేదా పోస్టులను ప్రోత్సహించవద్దని సూచించారు. ఏ సమాచారాన్ని ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, అభ్యంతరకర కంటెంట్ విషయంలో గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగించాలని తెలిపారు. జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎస్పీ గారు తెలిపినారు.

## ఆధార్ పనిచేయని కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.



**నారాయణపేట, జనవరి,30(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన డి ఎల్ ఏ ఎమ్ సి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆధార్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ దామోదర్ , అసిస్టెంట్ కలెక్టర్ శ్రీను రెవెన్యూ , అడిషనల్ డి.ఎస్.పి కమిటీ సభ్యులందరూ హాజరయ్యారు.ఈసమావేశంలో చర్చించిన అంశాలుఎన్ బి యు పెండెన్సీ యుడైస్ పాఠశాల వారీగా పెండెన్సీ,ఆధార్ కేంద్రాలు పనిచేయని మండలాల్లో శిబిరాలను ఏర్పాటు చేయించడానికి సూచనలు ఇవ్వబడ్డాయి.ప్రతి ఏఈకె కేంద్రంలో కొత్త రేటు చార్టులు మరియు చెల్లుబాటు అయ్యే సహాయక పత్రాల జాబితా ప్రదర్శన చెయ్యాలి అని ఆదేశించారు.అలాగే డిసిపిఓ/ డిఎస్డబ్ల్యూఓ ని సహాయక పత్రాల ధృవీకరణ మరియు ఆధార్ సంతృప్తతతో పాటు అనాథ వ్యక్తుల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను డి.ఎస్.పి లింగయ్య, ఎల్ . డి.యం.విజయ్ కుమార్,ఈ . డి.యం.విజయ్,సంబంధిత అధికారులు తదితరులు......

## విద్యార్థులు సమాజసేవలో ముందుండాలి



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 30 :** గజ్వేల్ బాయ్స్ అబ్ డిగ్రీ కాలేజ్ వర్గల్ మండలం రాంసాగర్ పల్లి లో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) క్యాంప్‌ను వారి ఆహ్వానం మేరకు సందర్శించిన జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ:విద్యార్థుల జీవిత లక్ష్యం కేవలం మార్కుల సాధన కాకుండా సామాజిక స్పృహ కూడా విద్యలో భాగమని,మా కోసం కాదు -- మీ కోసం మేము అనే ఎన్ఎస్ఎస్ నినాదం ద్వారా గ్రామీణ ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై అవగాహన కల్పించే అవకాశం లభిస్తుందని,సమాజ సేవలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు జట్టుకృషి, నాయకత్వం వంటి జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటారని,క్రమశిక్షణ, బాధ్యత, సామాజిక స్పృహ వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని వివరించారు.అలాగే బాలల హక్కులు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా మొదలగు అంశాల పై అవగాహన కల్పిస్తూ, యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి మార్గంలో నడిచి తమ ఆశయాలను సాధించి తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని సూచించారు.తధానంతరం అందరికలిసి గ్రామంలో శ్రమాధానం చేసి పరిసరాల పరిశుభ్రత గురుంచి గ్రామస్తులకి వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు పెద్దిరాజు, మహేందర్, రాంచంద్రం, శివశంకర్, వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, జనవరి30 :( సమయం న్యూస్ ) :** కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతిఒక్కరు తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేపట్టిన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ వర్ధంతి ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ మార్గదర్శనంలో నడవడమే ఆయానకిచ్చే ఘన నివాళి అన్నారు. మహాత్మా గాంధీ ని ఒక జర్నలిస్ట్ మీ జీవితం ద్వారా ఏం చెప్పదల్చుకున్నారు అని అడుగగా, నా జీవితమే ఒక సందేశమని మహాత్మా గాంధీ అన్నారని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, వివక్షకు గురై ఎన్నో అవమానాలకు మహాత్మా గాంధీ గురయ్యారని అన్నారు. ఒక తెల్ల జాతీయుడు, మహాత్మా గాంధీ ని జాతి వివక్ష తో రైలు నుండి గెంటివేసినప్పుడు, సత్యానికి, న్యాయానికి మహాత్మా గాంధీ పోరాడారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, దండి సత్యాగ్రహం లాంటి ఎన్నో ఉద్యమాలతో హింసకు తావులేకుండా, అహింసా మార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. కుష్టు రోగులకు సమాజంలో వివక్ష, ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి, వారికి ఆరోగ్యం, సమాజంలో వివక్ష తొలగించే విధంగా సబర్మతి ఆశ్రమంలో మహాత్మా గాంధీ సేవాలందించారన్నారు.కుష్టు వ్యాధి ఎవరి తప్పు కాదని, బాధితులను వివక్షకు గురిచేయవద్దని కలెక్టర్ అన్నారు. మందులతో పూర్తిగా నయమయ్యే జబ్బుని, కుష్టు రోగులకు సహాయంగా నిలవాలని అన్నారు. కుష్టు వ్యాధికి పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, 12 నెలలు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు, మచ్చలు ఏర్పడినప్పుడే, వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నారు. జిల్లాలో గుర్తించిన 74 మంది కుష్టువ్యాధిగ్రస్థుల ఉచిత చికిత్స అందిస్తున్నామన్నారు. అనుమానిత ప్రతిఒక్కరికి పరీక్షలు చేయాలన్నారు. స్పర్శ కుష్టు వ్యాధి ప్రచార కార్యక్రమాన్ని 30 జనవరి నుండి 13 ఫిబ్రవరి వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు.కుష్టు రహిత సమాజ నిర్మాణం, వ్యాప్తిని అడ్డుకోవడం, వ్యాధిగ్రస్తులపై ఉన్న కళంకాన్ని తొలగించి, వారికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే లక్ష్యంగా వెళ్ళాలన్నారు. కుష్టు వ్యాధిపట్ల ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుష్టు వ్యాధి నిర్మూలనకై అధికారులు, సిబ్బందిచే వాగ్దానం చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అదనపు వైద్య ఆరోగ్య అధికారి డా. చందు నాయక్, ఉప జిల్లా వైద్య అధికారి డా. వేణు మనోహర్, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పనులతోనే ప్రమాదాలు తగ్గుతాయి

- నాణ్యమైన పరికరాలనే వాడాలి అగ్ని ప్రమాదాలు నివారించాలి
- మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు
- తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల 12వ వార్షికోత్సవ మహాసభలో సీఈఐజీ




**హైదరాబాద్, జనవరి 30(సమయం న్యూస్) :** విద్యుత్ పనులను నాణ్యతగా చేయాలని, అప్పుడే నష్టాలు తగ్గుతాయని తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి సిహెచ్ కే నందకుమార్ అన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల 12వ వార్షికోత్సవ మహాసభలో 2026 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన తర్వాత ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడాలని సూచించారు. జాగ్రత్తలు పాటించడం ద్వారనే ఎలక్ట్రికల్ విద్యుత్ ప్రమాదాలను నివారించగలమన్నారు. నాణ్యత లేని పరికరాలను వాడడం వల్ల అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలను గుర్తించకపోవడం, ఫైర్ ఆడిట్ నిర్వహించకపోవడంతో పాటు మానవ తప్పిదాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఫైర్ ఎక్సింగ్విషర్ల వంటి పరికరాలు ఏర్పాటు చేయకపోవడంతో మంటలు అదుపు చేయడంలో అలస్యమై ఆస్తినష్టం వాటిల్లుతోంది. విద్యుత్ మరమ్మ త్తులు క్వాలిఫైడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ తో మరియు ఎలక్ట్రిషియన్ తో మాత్రమే చేయించాలన్నారు. అతుకులు కలిగిన తీగలు, లూజ్ వైరింగ్ ప్రమాదకరమని అన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జీసీరెడ్డి మాట్లాడుతు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించు కోగలుగుతామని అన్నారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడాలని అదేవిధంగా అసోసియేషన్ ఐక్యత ఉన్నప్పుడే సమస్యకు పరిష్కారం మార్గం దొరుకుతుందని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఉద్దేశించి అన్నారు. విద్యుత్ అధికారుల నుంచి సమస్యలు ఎదురైతే సంఘం దృష్టికి తీసుకుని రావాలని, అందరు ఒక్కటిగా వెళ్లి సమస్యను పరిష్కరించుకుందామన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎర్తింగ్ పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని, ఎర్తింగ్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నామిని వెంకటేష్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. మహేందర్. వి.పెద్ద పుల్లారావు, మస్తాన్. ఏ ఎస్ ఆర్. యు శీను, ప్రేమ్. రాష్ట్ర నాయకులు కే శ్రీనివాస్, ఎం వెంకటేష్. రాజు మహారాజ్ , మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కనుక చారి. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి. వెంకట్ రెడ్డి చిన్న పుల్లారావు. ప్రదీప్ రెడ్డి, భరత్రెడ్డి, బాల్ రెడ్డి. వివిధ కంపెనీల ప్రతినిధులు కూడా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమం.,భద్ర త కు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జనవరి 30 ( సమయం న్యూస్) :** ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, హాస్టళ్ల ప్రాంతీయ సమన్వయకర్తలు (ఆర్.సీ.ఓ)లు, నిర్వాహకులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్న సంఘటనలను ఉటంకిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ తరహా ఉదంతాలు చోటుచేసుకోకుండా పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి బాలికల వసతి గృహాలు, గురుకులాల నిర్వహణ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల హాస్టళ్లలో ఇతరులు ఎవరూ ప్రవేశించకుండా కట్టడి చేయాలని, తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలని సూచించారు. సీ.సీ కెమెరాలు తప్పనిసరిగా పని చేయాలని అన్నారు. వసతి గృహాల ప్రాంగణాలు, పరిసరాలలో ఎక్కడైనా గుంతలు వంటివి ఉంటే తక్షణమే పూడ్చి వేయించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన నీటి సరఫరా, ఆహార పరిశుభ్రత, పౌష్టిక ఆహారం అందించడానికి కావలసినటువంటి ఏర్పాట్లను అనునిత్యం పర్యవేక్షించాలన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు, గడ్డి వంటివి పెరగకుండా చూడాలని, పాముకాటు వంటి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.క్రమం తప్పకుండా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం శుభ్రమైన ఆహార పదార్థాలను అందించడానికి వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించడానికి, కలుషిత ఆహారం ద్వారా వ్యాధులు సోకకుండా ఫుడ్ పాయిజన్ సమస్యను నివారించడానికి శానిటేషన్ సిబ్బందికి, వంటగదిలో పని చేసే సిబ్బందికి తగిన సూచనలు చేయాలన్నారు. వంట పాత్రలు శుభ్రంగా కడిగేలా పర్యవేక్షణ జరపాలని, నిల్వ ఉంచిన నాన్ వెజ్ ను అందించకూడదని ఆదేశించారు. విద్యార్థులతో ఆప్యాయంగా వ్యవహరిస్తూ, తమ సొంత బిడ్డలుగా వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, ఆర్.సీ.ఓలు, హాస్టళ్ల నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్జుని గ్రామంలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

- మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాం
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**గాడిగూడ జనవరి30( సమయం న్యూస్).:** గాదిగూడ మండలం అర్జుని గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (పీఎస్)లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులంతా సాదర స్వాగతం పలికారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గాదిగూడ మండలంలోని రహదారుల పరిస్థితిని మెరుగుపరిచి, ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని, గృహ నిర్మాణ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆహార హారపదార్థాలను కలెక్టర్ రుచి చూసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమలాబాయి, పటేల్ రావుజీ పటేల్, తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపిఓగంగాధర్, ఏంఈఓ రమేష్, ప్రధానోపాధ్యాయులు మెస్రం శేఖర్, రాయ్ సెంటర్ సార్ మేడి మండాడి దౌలత్ రావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ కోసం మినీ సీవరేజ్ మాస్టర్ ప్లాన్.

- భవిష్యత్ సీవరేజ్ అవసరాలకు తగ్గట్లుగా ప్రణాళిక రూపొందించాలి
- నానక్ రాం గూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో పర్యటన
- ముఖ్యమంత్రి ఆదేశాలతో ఎండీ అధికారులతో కలిసి పరిశీలన



**ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ జనవరి30( సమయం న్యూస్) :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నానక్ రాం గూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో సీవరేజ్ సిస్టమ్ ను మెరుగు పరచడానికి, ట్రంక్ మెయిన్లను అభివృద్ధి చేయడానికి మినీ సీవరేజ్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి, నానక్ రాం గూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలను ఎండీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా.. అధికారులతో ఈ ప్రాంతాల్లో ప్రస్తుతానికి ఉత్పన్నం అవుతున్న మురుగు, ఇప్పటివరకు ఉన్న సీవరేజ్ లైన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను బట్టి సీవరేజ్ లైన్లను, ట్రంక్ మెయిన్ల అభివృద్ధికి మినీ సీవరేజ్ ప్లాన్ లను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న నాలాలు, వాననీటి కాలువలు, ట్రంక్ మెయిన్ల వివరాలను సేకరించి అధ్యయనం చేయాలని సూచించారు. అలాగే, మూసీ , ఇతర సమీప చెరువుల్లో మురుగు చేరి కలుషితం కాకుండా వర్షపు నీటి కాలువలనుంచి మురుగునీటి పైపు లైన్లను వేరుచేసి 2047 మాస్టర్ ప్లాన్ ఆధారంగా సీవరేజ్ ట్రంక్ మెయిన్ల, సబ్ సీవరేజ్ లైన్ల నిర్మాణంకోసం ప్రతిపాదనను సమర్పించాలని అన్నారు. దీనికై ఓ అండ్ ఎం, ఎస్టీపీ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. దీంతోపాటు నానక్ రాం గూడ ఎస్టీపీ క్యాచ్ మెంట్ ప్రాంతాల్లో ఉత్పన్నమయ్యే మురుగును అంచనావేసి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎస్టీపీ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్టీపీ విభాగ అధికారులకు సూచించారు. గచ్చిబౌలి నుంచి కోకపేట్ పరిసర ప్రాంతాల్లో ఉత్పన్నం అవుతున్న మురు గును కోకాపేట ఎస్టీపీకి తరలించి.. శుద్ధి చేయడానికి సీవర్ ట్రంక్ మెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సమర్పించాలి అధికారులను కోరారు. అలాగే కోకపేట్ దిగువనున్న ప్రాంతాలోని మురుగును సమీపంలోని చిత్రపురి, ఇబ్రహీం చెరువు ఎస్టీపీకి మళ్ళించడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకుము ందు నానక్ రాం గూడలోని 4.5 ఎమ్మెల్డీల సామర్థ్యం కలిగిన ఎస్టీపీని సందర్శించారు. మురుగుశుద్ధి ప్రక్రియను పరిశీలించిన ఎండీ..ఎస్టీపీ సామర్థ్యం, శుద్ధి నీటి నాణ్యత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీప ప్రాంతాల్లోని ఉత్పన్నమయ్యే మురుగును ఈ ఎస్టీపీలో శుద్ధి చేసే సామర్థ్యం ఉందా.. లేకుంటే సామర్థ్యం పెంచడానికి, కొత్త ఎస్టీపీ నిర్మించడానికి సాధ్యసాధ్యాలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీపీ కార్యాలయం సందర్శించిన ఎండీ అన్నీ ఎస్టీపీల మురుగుశుద్ధి వివరాలను, గణాంకాలను ఎప్పటికప్పుడు నమోదుచేయడానికి ప్రత్యేకమైన యాప్ ను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీనివల్ల ఎక్కడినుంచి అయినా వివరాలను తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని అన్నారు. నానక్ రాంగూడ ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటిని గోల్ఫ్ కోర్టులో వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందుకు ఓఆర్ఆర్ వెంట శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడానికి పైప్ లైన్ నిర్మించడానికి డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పైప్ లైన్ తో ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న గార్డెనింగ్ కి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడానికి సంబంధించిన అధికారులతో మాట్లాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం పద్మజ, జీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య.



**కొత్తగూడెం జనవరి30 ( సమయం న్యూస్). :** జిల్లాలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శక వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు పూర్తి బాధ్యతతో తమ విధులను నిర్వర్తించాలని మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య సూచించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఏఈఓలు, తహసీల్దార్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు (ఎఫ్ఎస్టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీములు (ఎస్ఎస్టీ), వీడియో సర్వైలెన్స్ టీములు (విఎస్టీ), వీడియో వ్యూయింగ్ టీములు (వివీటీ)లతో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు -- 8, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు -- 8, వీడియో సర్వైలెన్స్ మరియు వీడియో వ్యూయింగ్ టీములు, జీఎస్టీ అధికారులు -- 8 మంది, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్లు (ఏఈఓలు) -- 10 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగితే తక్షణమే చర్యలు తీసుకునే విధంగా అన్ని బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య మాట్లాడుతూ, అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కఠిన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, బహుమతులు తదితర ప్రలోభకర అంశాల పంపిణీని అడ్డుకునేందుకు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, ప్రచార సామగ్రి, ర్యాలీలు, సభలు, పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం వంటి అన్ని అంశాలపై సమగ్ర అవగాహనతో పర్యవేక్షణ జరగాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఖర్చును ఖచ్చితంగా నమోదు చేసి, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఖర్చుల ఖాతాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అన్ని బృందాలు ప్రతిరోజూ నిర్వహించిన తనిఖీలు, స్వాధీనాలు, నమోదైన కేసులు తదితర వివరాలతో కూడిన రోజువారీ నివేదికలను తప్పనిసరిగా సమర్పించాలని, చేపట్టిన ప్రతి చర్యను ఖచ్చితంగా నమోదు చేసి స్వాధీనాల వివరాలను అధికారిక రికార్డుల్లో పొందుపరచాలని ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి చిన్న నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణకు నియమిత వివిధ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## గుర్రంపేట మినీ మేడారం జాతర ను సందర్శించి మొక్కులు చెల్లించిన జిల్లా కలెక్టర్



**భూపాల పల్లి జనవరి30( సమయ్యం న్యూస్).:** శుక్రవారం భూపాలపల్లి మండల పరిధిలోని గుర్రంపేటలో నిర్వహిస్తున్న శ్రీ సమ్మక్క--సారలమ్మ మిని మేడారం జాతరను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయ సంప్రదాయం ప్రకారం మేళ తాళాలతో స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారం చెల్లించారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత, పారిశుధ్యం, త్రాగునీరు, వైద్య సేవలు సమర్థవంతంగా అందించాలని సూచించారు. జాతరను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసు, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితర అధికారులు, ఆలయ సిబ్బంది, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, జనవరి,30(సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు ఈ సందర్భంగా ఆమె కంట్రోల్ రూమ్ యొక్క పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులు తో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అధికారులకు అందించాలని అన్నారు. కంట్రోల్ రూమ్ కి ఏవీ అయినా ఫిర్యాదుల వచ్చినయ అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సాయిబాబా అధికారులు,. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.



**నారాయణపేట, జనవరి,30(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీల నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూర్ ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మరియు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు లేదా అసత్య ప్రచారాలు చేస్తే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా పై నిఘా కొరకు ప్రత్యేక సోషల్ మీడియా మోనిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని విరు నిరంతరం సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను, పోస్టులను గమనిస్తూ ఉంటారని ఎవరైనా ఒకరిని కించపరిచే విధంగా, ఒక వర్గానికి చెందిన వారిపై తప్పుడు పోస్టులు చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మరియు సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు లేదా పోస్టులను ప్రోత్సహించవద్దని సూచించారు. ఏదైనా సమాచారాన్ని ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, అభ్యంతరకర కంటెంట్ విషయంలో గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగించాలని తెలిపారు. జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎస్పీ కోరారు.


## సీఎం కప్ క్రీడల విజేతలకు బహుమతి ప్రధానం



**ఖమ్మం జనవరి 30 :( సమయం న్యూస్ ) :** ఖమ్మం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో గత రెండు రోజుల నుండి జరుగుతున్న ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి సీఎం కప్ క్రీడల్లో శుక్రవారం విజేతలకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పూనకోలు నీరజ డిప్యూటీ మేయర్ ఫాతిమా , డివైస్ ఓ సునీల్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, మండల విద్యాశాఖ అధికారిని శైలజలక్ష్మి, టూ టౌన్ సిఐ బాలకృష్ణ, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామారెడ్డి విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా ఖమ్మం కార్పొరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బియ్యనీ కృష్ణయ్య ఈ సందర్భంగా విజేతల వివరాలు వెల్లడించారు. వాలీబాల్ బాయ్స్ విన్నెర్స్ జడ్.పి.హెచ్.ఎస్ కొత్తగూడెం ,రన్నర్స్ కేంద్రీయ విద్యాలయం, గాల్స్ విన్నెర్స్ , ఎస్పీ స్టేడియం ఖమ్మం, రన్నర్స్ కేంద్రీయ విద్యాలయం , కోకో బాయ్స్ విన్నర్స్ ఖాన పురం రన్నర్స్ ఎస్ఎఫ్ఎస్ ఖమ్మం, గర్ల్స్ విన్నర్స్ కోకో జిహెచ్ఎస్ ఎన్ఎస్పీ కెనాల్ , బ్రదర్స్ ఎస్ ఎఫ్ ఎస్ ఖమ్మం, చెస్ విన్నెర్స్ రన్నర్ ఎం నిత్యం బాయ్స్ విన్నర్ ఏ అనీష్ సూర్య రన్నర్ అక్షయ్ కుమార్, కబడ్డీ గర్ల్స్ విన్నెర్స్ రామన్నపేట ఎన్ఎస్సి కెనాల్ , రన్నర్స్ కేంద్రీయ విద్యాలయం, కబడ్డీ బాయ్స్ విన్నెర్స్ దిలీప్ అండ్ టీం, రన్నర్స్ షేక్ సాయద్ అండ్ టీం, ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని అఫీషియల్స్ పారిజాత, లాలయ్య, నాగుల మీద, రాము, రోజా, విజయకుమారి, సంపత్, నాగప్రసాద్, మల్లయ్య, నాగేశ్వరరావు, నాగరాజు, రజిత, సిఎం కప్ కోఆర్డినేటర్ ఆదర్శ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.


## అభివృద్దే మా నినాదం

- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి : నందారం ప్రశాంత్.



**కొడంగల్ మున్సిపల్, జనవరి,30 (సమయం న్యూస్) :** కొడంగల్ లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా నినాదం. గాడి, గుడి కలిసి ఒకే ఒరా లో ఉండి ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా 12 వార్డులకు గాను,12 వార్డులు క్లీన్ స్వీప్ చేసుకొని 5 సంవత్సరాలు కనివిని ఎరుగని రీతిలో కొడంగల్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం గతంలో పని చేసిన అనుభవం ఉంది కాబట్టి ( గడి,గుడి కలిసి అభివృద్ధి పథం లో నడిపిస్తాం) ఎవ్వరు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీర్వాదంతో 75-80 ఏళ్ళ చరిత్రను కొడంగల్ తిరగరాయబోతుంది . మొన్న నే కొడంగల్ అప్పయ్య పల్లి లో కాలేజీలు పోయాయని పుకార్లు సృష్టించి, గందరగోళం నెలకొల్పే పరిస్థితి సృటించారు..కానీ ముఖ్య మంత్రి తో మాట్లాడి అగ్రికల్చర్ యూనివర్సిటీ తెచ్చుకున్నాం. హుస్సేన్ పూర్ 300 ఎకరాల భూ సేకరణకు దరఖాస్తు చేసుకున్నారు ఎలక్షన్లు అయిపోయిన వెంటనే భూ సేకరణ చేసి ఫ్యాక్టరీలు పెట్టేలా ఏర్పాట్లు చేస్తు న్నాం. కస్తూర్ పల్లి లో సిమెంట్ ఫ్యాక్టరీ కూడా ప్రారంభం కాబోతుంది.. ప్రజలందరూ సహకరించి తప్పకుండా నన్ను గెలిపించండి. ముద్దప్ప. జగ్గప్ప, అందరం కలిసి మాట్లాడుకుని కొడంగల్ కు పట్టిన దరిద్రం పోవాలంటే మనమందరం ఇక తాటిపై నడిచి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మేము చర్చించుకున్నాం.. ఆ ప్రకారమే మున్సిపల్ ఎలక్షన్లో మా కార్యచరణ ఉండబోతుంది...ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బి టి రోడ్డు పనులు పరిశీలన



**గాడిగూడ జనవరి 30( సమయం న్యూస్) :** ఝరి నుండి కుండీ కొలంగూడ వరకు 5.13 కిలోమీటర్లు 6.22 కోట్లతో మంజూరైనా బిటి రోడ్డు ను శుక్రవారం గాదిగూడ మండలం కుండి గ్రామంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించి అధికారులకు, కాంటాక్టర్ కు పలు సూచనలు చేశారు. పాల్గొన్న స్టేట్ కౌన్సిలిటి మానిటర్ అధికారి హనుమంత్ రావు, జెఇ లింగన్న, రోడ్డు కాంట్రాక్టు ముంతాజ్, ఎంపీడీఓ శ్రీనివాస్, మండల తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మారశ్వనే యోగేష్, ఆయా గ్రామాల సర్పంచ్లు కన్ను బాయి, పూసం బాధిరావ్, చంద్రకళ రాజు, అధికారులు, తదితరులు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్

**నిజామాబాద్, జనవరి 30 ( సమయం న్యూస్)** మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్. సత్యనారాయణ రెడ్డి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని 13, 14’ 15 డివిజన్ల నామినేషన్ల స్వీకరణ కేంద్రంతో పాటు అర్సపల్లి వాటర్ ట్యాంక్ జోన్ ఆఫీసు, బోధన్, ఆర్మూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భీంగల్ మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని నిశిత పరిశీలన చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్ లను పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులతో చర్చించి, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్ గురించి అడిగి తెలుసుకున్నారు. టీ పోల్ యాప్ లో ఎన్నికల రిపోర్టులు అప్లోడ్ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ వెంట బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.

# తాండూరు కాంగ్రెస్ అడ్డ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి




**తాండూరు మున్సిపల్, జనవరి,30(సమయం న్యూస్ :** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ చివరి రోజు నామినేషన్ల అనంతరం తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...తాండూర్ అంటేనే కాంగ్రెస్ అడ్డా కచ్చితంగా తాండూరు మున్సిపల్ లో చైర్పర్సన్ తో పాటు అన్ని 36మున్సిపల్ వార్డుల ను కైవాసం చేసుకుంటాము మాజీ ఎమ్మెల్యే పై మండిపడ్డ మనోహర్ రెడ్డిఎంతమందిని గెలిపించావో ఆలోచించుకోవాలి ఈ సవాల్ కు సిద్ధంగా ఉన్నాను సీఎం తాండూరుపై దృష్టి పెట్టారు తాండూరు మున్సిపల్ మూడు సంవత్సరాలు తర్వాత 75 వసంతాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా ప్రణాళిక ప్రకారం తాండూరులో ప్రతి ఇంటికి నీరు అందించాలని ఉద్దేశంతో కాగ్న నది నుండి సురక్షితమైనటువంటి మంచినీరు అందించడం కోసం 30 కోట్లు మంజూరయ్యాయి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు

# నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి,నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం జనవరి39( సమయం న్యూస్).:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద విధులలో ఉన్న పోలీసు అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని,అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు.గుంపులు గుంపులుగా రావడం,నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపడతామని తెలియజేశారు.సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ,మెటల్ డిటెక్టర్లు,బారికేడ్లు,ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.జిల్లాలో శాంతియుత,స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

# బొజ్జాయిగూడెం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**ఇల్లందు జనవరి30( సమయం న్యూస్) :** సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం గద్దెలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు.సమ్మక్క-సారలమ్మ గద్దెలను ఎస్పీ దర్శించుకున్నారు. గద్దెల దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటుచేసిన బందోబస్తును పరిశీలించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి వెంకన్నబాబు,సీఐ సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి.

● **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**



**కొత్తగూడెం జనవరి30( సమయం న్యూస్) :** విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగటానికి ఇప్పటి నుంచే కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్లో సోహన్ అకాడమీ మరియు విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన “మీట్ ద కలెక్టర్” కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా వారి చుట్టూ ఉండే అనేక రకాల సమస్యలకు సాంకేతికత ఆధారంగా పరిష్కారాలు కనుగొనాలని, ఆ పరిష్కారాలు ఆచరణ యోగ్యంగా ఉండి ఎవరైనా స్వల్ప పెట్టుబడితో తయారు చేసుకునే విధంగా ఉండాలని సూచించారు. ఇలా తయారు చేసే క్రమంలోనే శాస్త్రవేత్తలు ఆవిర్భవిస్తారని, వారే దేశ ప్రజల ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపగలుగుతారని పిల్లలకు ఉద్బోధించారు. పిల్లలు తయారు చేసిన వివిధ రకాల రోబోటిక్ ఎగ్జిబిట్లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. రైతులు పంటలు పండించడానికి ఎదుర్కొనే సమస్యలు, ఇళ్లలో కోతుల సమస్యలు, దొంగల నుండి ఇంటిని రక్షించుకోవడానికే అవసరమైన వ్యవస్థలు, ఇటువంటి నిత్య జీవిత సమస్యలకు ఆచరణ యోగ్యమైన పరిష్కారాలు కనుగొనాలని పిల్లలకు తెలిపారు. సోహన్ అకాడమీ వారు జిల్లాలోని గుర్తించిన 13 పీఎం శ్రీ పాఠశాలల్లో వర్క్ షాప్ లు నిర్వహించి పిల్లలకు రోబోటిక్స్ పై అవగాహన కల్పించడం నిజంగా అభినందనీయమని అన్నారు. సోహన్ అకాడమీ డైరెక్టర్ సహదేవ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 32 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశామని, కానీ భద్రాద్రి జిల్లాలో లభించిన ఆదరణ ఏ జిల్లాలోనూ లభించలేదని దీనికి కారణమైన కలెక్టర్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకంలో భాగంగా పీఎం శ్రీ పాఠశా లలకు అందించిన పరికరాలను ఎలా వినియోగించాలో ఉపాధ్యాయులకు విద్యార్థులకు కూడా అవగాహన కల్పించిన సోహన్ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరచిన పాఠశాలలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ నాగరాజ శేఖర్, సమ్మేళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, సోహన్ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ సహదేవ్, మరియు వారి బృందం తో పాటు ఎన్నిక చేసిన 13 పీఎం శ్రీ పాఠశాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చర్లపల్లి రైల్వే స్టేషన్ను తనిఖీచేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

● **స్టేషన్లో కొత్త రన్నింగ్ రూమ్ మరియు క్రూ బుకింగ్ లాబీని జనరల్ మేనేజర్ ప్రారంభించారు.**



**చర్ల పల్లి జనవరి30( సమయం న్యూస్) :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈరోజు అనగా జనవరి 30, 2026న సికింద్రాబాద్ డివిజన్లోని చర్లపల్లి రైల్వే స్టేషన్ను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ ఇతర సీనియర్ అధికారులు కూడా ఉన్నారు.రైలు అనుసంధానాన్ని మెరుగుపరచడం, ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలను అందించడం మరియు సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లలో రద్దీని తగ్గించడం లక్ష్యంగా, హైదరాబాద్ జంట నగరాలలో చర్లపల్లి స్టేషన్ను ఇటీవల రూ. 413 కోట్ల వ్యయంతో కొత్త టెర్మినల్ స్టేషన్గా అభివృద్ధి చేయబడింది. దీనిలో భాగంగా, కొత్తగా అభివృద్ధి చేసిన చర్లపల్లి టెర్మినల్లో పలు రైళ్లకు ఆగే సౌకర్యం కల్పించబడింది. చర్లపల్లి రైల్వే టెర్మినల్లో లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు మరియు ట్రైన్ మేనేజర్లు మొదలైన రైలు నడిపే సిబ్బందికి రైళ్ల నిర్వహణలో ఏర్పడే అవసరాలను తీర్చడానికి, కొత్త రన్నింగ్ రూమ్ మరియు క్రూ లాబీ సౌకర్యాలు కల్పించబడ్డాయి.ఇందుకుగాను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈరోజు కొత్త రన్నింగ్ రూమ్ మరియు క్రూ లాబీని ప్రారంభించారు. జనరల్ మేనేజర్ కొత్త రన్నింగ్ రూమ్లో అందించిన కంప్యూటరైజ్డ్ బెడ్ ఆక్యుపేషన్, మహిళా సిబ్బందికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతి, ఎయిర్ కండిషనింగ్, యోగా మరియు ధ్యానం కోసం నిర్మించిన గదులు, మాడ్యులర్ కిచెన్, ఆర్.ఓ ప్లాంట్లు, సిసిటివి నిఘా వంటి సౌకర్యాలను పరిశీలించారు. క్రూ లాబీలోని క్రూ మేనేజ్మెంట్ సిస్టమ్, వంటగది మరియు సీటింగ్ ఏర్పాట్లు వంటి సౌకర్యాలను కూడా ఆయన సమీక్షించారు. ఇంకా, శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చర్లపల్లి స్టేషన్లోని ఐ.ఓ.ఎచ్ (ఇంటర్మీడియట్ ఓవర్హాలింగ్ షెడ్)ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన కోచ్ నిర్వహణ సౌకర్యాలను సమీక్షించారు మరియు అధికారులతో భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. జనరల్ మేనేజర్ షెడ్లో ఉన్న ఖాళీ అమృత్ భారత్ రైలు రేక్ను తనిఖీ చేసి, కోచ్లలో అందించిన కొత్త సౌకర్యాలను సమీక్షించారు. చర్లపల్లి టెర్మినల్లోని ప్లాట్ఫామ్ నంబర్ 1లో ప్రతిపాదిత కొత్త ఎంట్రీ అలైన్మెంట్ మరియు అప్రోచ్ను శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పరిశీలించారు. జనరల్ మేనేజర్ సుస్థిరత మరియు పర్యావరణహిత భవిష్యత్తు కోసం రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు



# ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

● **ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య**

**నారాయణపేట, జనవరి,30(సమయం న్యూస్) :** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం, హెల్మెట్ ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులకు హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రమాదం అని తెలిపారు.హెల్మెట్ మీ తలకే కాదు -- మీ కుటుంబ భవిష్యత్తుకూ రక్షణ.హెల్మెట్ ధరించండి -- సురక్షితంగా ఇంటికి చేరండి. అనే స్లోగన్స్ ద్వారా అవగాహన కల్పించారు.ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ... ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలు కావడం వల్ల ప్రాణనష్టం సంభవిస్తోందని, అలాంటి ప్రమాదాలను నివారించడానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిన అవసరం ఉందన్నారు. హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన నిబంధన మాత్రమే కాకుండా ప్రతి వాహనదారి నైతిక బాధ్యతగా భావించాలని సూచించారు.ముఖ్యంగా యువత, విద్యార్థులు హెల్మెట్ను నిర్లక్ష్యం చేయకుండా తమ ప్రాణ భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, హెల్మెట్ ధరించడం ద్వారా కుటుంబ సభ్యులకు బాధ కలగకుండా ఉండవచ్చని తెలిపారు.రోడ్డు భద్రత మాసోత్సవాల భాగంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నారాయణపేట జిల్లా కేంద్రంలో నిరంతరం కొనసాగించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచుతామని ట్రాఫిక్ ఎస్సై వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

● **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

● **2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై**

● **సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**మంథని, జనవరి- 30:( సమయం న్యూస్).:** గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని లోని ఆర్డిఓ కార్యాలయంలో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్న ప్రముఖులు








**మేడారం జనవరి30( సమయం న్యూస్) :** శుక్రవారం మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో పలు ప్రముఖులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ,రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు దనసరి అనసూయ కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ సైతం అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఎంపీ బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్, భూపాల్ పల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ మేడారం జాతరను సందర్శించి అమ్మవారు దర్శనం చేసుకున్నారు.

పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా అమ్మ వార్లకు మొక్కులు చెల్లించారు.

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ వుమెన్ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ కు గద్దెల వద్ద జరిగిన నూతన కట్టడాలు అభివృద్ధి గురించి విశేషాలు గురించి మంత్రి సీతక్క వివరించారు.

## సీఎం సభ ఏర్పాట్ల కోసం స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి



**పరిగి మండలం, జనవరి,30(సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించనున్న మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న సందర్భంగా, సభ ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్,ఎస్సై మోహన్ కృష్ణ అలాగే విద్యుత్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిగి మండలం రూఫ్ ఖాన్‌పేట్ అలాగే నారాయణపూర్ పరిధిలో సభ స్థలాన్ని పరిశీలించారు.సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని,జన సమీకరణ, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై అధికారులు, నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ విజయపథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే డా. టి.రామ్మోహన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని తెలిపారు.

## పురపాలక పీఠం పై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం..

- చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింహులు



**తాండూర్ మున్సిపల్, జనవరి,30(సమయం న్యూస్) :** ర్యాలీగా బయలుదేరి రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన పట్లోళ్ల కుటుంభం..వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణం సాయిపూర్ 9వ వార్డ్ నుండి మాజీ వైస్-చైర్ పర్సన్ దీప,10వ వార్డ్ నుండి పట్లోళ్ల నర్సింహులు బరిలోకి.. తాండూరు పురపాలక పీఠం బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని 36 వార్డులలో అత్యధిక స్థానాలలో గులాబీ జెండాను ఎగరేసి మున్సిపల్ పీఠం కైవసం చేసుకుంటామని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింహులు పేర్కొన్నారు..సాయిపూర్ ప్రాంతం నుండి పురపాలక కార్యాలయం వరకు పెద్దసంఖ్యలో ర్యాలీగా బయలుదేరి 9,10వ వార్డుల నుండి పట్లోళ్ల దీప,పట్లోళ్ల నర్సింహులు రెండో సెట్ నామినేషన్ దాఖలు....

## ప్రజల సేవే నా బాధ్యత

- కేశపల్లి వెంకట్‌రాంరెడ్డి




**చేవెళ్ళ: జనవరి:30:(సమయం న్యూస్) :** 5వ వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కేశపల్లి వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సేవే తన రాజకీయ ప్రయాణంలో ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. వార్డులో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం ప్రజల మధ్య ఉండి పని చేస్తానని అన్నారు. నేడు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కేశపల్లి వెంకట్‌రాంరెడ్డి నివాసం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వార్డు ప్రజలు, పెద్దలు, యువత, అన్నదమ్ములు, అక్కచెల్లెలు, శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని సహకరించాలని ఆయన కోరారు. వార్డు అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన కర్తవ్యమని ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి స్పష్టం చేశారు.

## బీసీలు రాజ్యాధికారంలో ముందుండాలి .



**చేవెళ్ల జనవరి;30. (సమయం న్యూస్) :** చేవెళ్ల మున్సిపాలిటీలో ౧౼ా జెండా ఎగరావేయాలని చేవెళ్ల మండల అధ్యక్షులు కునుకుర్తి అశోక్ (అడ్వాకేట్ ) ఎగరావేయాలని అన్నారు ఈరోజు 5వ వార్డు ౧౼ా అభ్యర్థిగా మౌడపల్లి రాజు నామినేషన్ వేయడం జరిగిందిచేవెళ్ల మున్సిపాలిటీలో ౧౼ా బలపార్చిన అభ్యర్థుల గెలుపు కొరకు కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎ. జనార్దన్,అధికార ప్రతినిధి రంగారెడ్డి జిల్లా సబ్బరి గారి రాజు, చేవెళ్ల మండల యూత్ ప్రెసిడెంట్ సందీప్ . నరేష్ గౌడ్ . సురేష్ మరియు TRP నాయకులు పాల్గొన్నారు.

## పూర్తయిన నామినేషన్ల పర్వం.

- కాంగ్రెస్,బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి రంగంలోకి దిగిన అభ్యర్థులు..
- ప్రధానమైన వార్డులలో కీలకం కానున్న స్వతంత్ర అభ్యర్థులు..
- 16 వార్డులకు అధికార పార్టీ అభ్యర్థులకు బిఫామ్ ల అందజేత..
- అన్ని వార్డులలో అభ్యర్థులను రంగంలోకి దింపిన బిఆర్ఎస్..
- నామ మాత్రంగానే బీజేపీ పోటీ..





**కోస్గి మున్సిపల్ జనవరి,30(సమయం న్యూస్) :** మునిసిపల్ ఎన్నికల రణరంగంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా కొనసాగే అవకాశం ఉంది.నారాయణపేట కోస్గి మున్సిపాలిటీలో 16 వార్డులలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాన నాయకులు, వారి సతీమణులు పార్టీ బీఫాంలు అందుకుని ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. అదేవిధంగా బిఆర్ఎస్, బిజెపి పార్టీకి చెందిన అభ్యర్థులు కూడా ఎన్నికల బరిలో నిలిచి గెలుపు లక్ష్యంగా ముందుకు దూసుకెళ్తున్నారు.నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో పూర్తి కావడంతో అభ్యర్థులు పార్టీల తరపున బి ఫామ్ లు తీసుకొని ఎన్నికల రంగంలో సత్తా చాటేందుకు సమా యత్తమవుతున్నారు. నామినేషన్ల చివరి రోజు మొత్తం80 నామినేషన్లు దాఖలయ్యాయి. కోస్గి మున్సిపల్ లో 16 వార్డులకు గాను 119 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



**రాయపోల్,జనవరి 30 :** మండల కేంద్రం రాయపోల్‌లో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని తొగుట సీఐ లతీఫ్, ఎంపీడీవో శ్రీనివాస్ రావు లు ప్రారంభించారు.యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపేలా ఈ పోటీలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీఐ లతీఫ్,ఎంపీడీవో శ్రీనివాస్ రావు లు మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా ఎంతో దోహదపడతాయన్నారు. యువత క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి వంటి విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ సీఎం కప్ పోటీల్లోవివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో తదితర క్రీడల్లో పోటీలు జరిగాయి.విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య,మండల విద్యాశాఖ అధికారి రాజగోపాల్, ఎఎస్సై దేవయ్య, సర్పంచుల పోరశీ మండల అధ్యక్షులు రేకుల నరసింహ రెడ్డి,ఇన్చార్జి హెచ్ఎం నాగరాజు,రాయపోల్ సర్పంచ్ మాసాన్ పల్లి రాజు వివిధ గ్రామాల సర్పంచులు, ఎపిఓ శివకుమార్, సెక్రటరీలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

## అక్రమంగా వెళ్తున్న ఇసుక ట్రాకర్ పట్టివేత

- అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు-
- యాలాల ఎస్సై విఠల్ రెడ్డి




**యాలాల మండలం, జనవరి,30(సమయం న్యూస్) :** బాగాయి పల్లి చౌరస్తాలో శుక్రవారం తెల్లవారుజామున యలాల్ పోలీసు వారు నమ్మదగిన సమాచారం మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న న్యూహోలాండ్ ట్రాక్టర్ ఇంజిన్ నెంబర్ టీఎస్ 34+5429, ట్రోలీ నెంబర్. ఏపీ07ఏఏ8805 ను పట్టుకోవడం జరిగింది, అదే సమయంలో ట్రాక్టర్ యొక్క డ్రైవర్ అక్కడి నుండి పారిపోవడం జరిగింది. అట్టి ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కి తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు. ఎవరైనా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## మేడారం జాతరలో భక్తుల కోలాహలం - ఏర్పాట్లపై సర్వత్రా హర్షం.

**మేడారం జనవరి 30( సమయం న్యూస్). :** తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ ఏడాది ప్రభుత్వం మరియు అధికారులు చేసిన అత్యుత్తమ ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన దర్శనం: గత ఏళ్లతో పోలిస్తే ఈసారి దర్శనం చాలా వేగంగా జరుగుతోందని భక్తులు తెలిపారు. గతంలో 5-6 గంటలు పట్టే దర్శనం, ఈసారి కేవలం 2 గంటల్లోనే పూర్తవుతోందని మంచిర్యాల నుండి వచ్చిన భాను చందర్ దేవరకొండ దంపతులు పేర్కొన్నారు.

మెరుగైన మౌలిక వసతులు : రోడ్ల విస్తరణ, రవాణా సౌకర్యాలు మరియు తాగునీటి ఏర్పాట్లు చాలా బాగున్నాయని భక్తులు కొనియాడారు. గోదావరిఖని నుండి వచ్చిన పుష్ప మాట్లాడుతూ, గతేడాది కంటే ఈ ఏడాది వసతులు ఎంతో బ్రహ్మాండంగా ఉన్నాయని తెలిపారు.

పోలీస్ యంత్రాంగం సహకారం: ట్రాఫిక్ నియంత్రణ మరియు భక్తుల క్యూ లైన్ల నిర్వహణలో పోలీస్ యంత్రాంగం అందిస్తున్న సహకారం అభినందనీయమని విజయవాడ నుండి వచ్చిన నిజాం మొహిద్దీన్ బృందం తెలిపింది.

గ్రామీణ భక్తుల రాక: కాగజ్‌నగర్, బురదగూడ వంటి మారుమూల గ్రామాల నుండి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాదాపు 50 మందితో కలిసి బస్సులో వచ్చిన భక్తులు, జాతరలో తమకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని సంతోషం వ్యక్తం చేశారు.సమ్మక్క-సారలమ్మ తల్లులపై ఉన్న అచంచల విశ్వాసంతో ప్రతి రెండేళ్లకు ఒకసారి వస్తున్నామని, ఈసారి దర్శన ఏర్పాట్లు మరియు శుభ్రత విషయంలో తీసుకున్న జాగ్రత్తలు తమకు ఎంతో తృప్తినిచ్చాయని భక్తులు ముక్తకంఠంతో చాటుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి తాత్కాలిక రద్దు..

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.



**భూపాల పల్లి జనవరి30( సమయం న్యూస్).:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం పురపాలక ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసునట్లు ఆయన పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి యంత్రాంగానికి సహకరించాలని ఆయన సూచించారు.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల అధికారిణి..



**కోస్గి మున్సిపల్, జనవరి,30(సమయం న్యూస్) :** కోస్గి పురపాలక సంఘం ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ సీత లక్ష్మీ పరిశీలించారు.నామినేషన్ కేంద్రంలోని అన్ని వార్డులకు వేయనున్న నామినేషన్ సెంటర్ల ఎన్నికల అధికారులతో మాట్లాడారు.ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాగరాజు,ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతిపిత వర్ధంతి వేడుకలు.



**బాన్సువాడ జనవరి30( సమయ్దం న్యూస్) :** జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా బాన్సువాడ పట్టణం పోచారం గారి నివాసంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ శ్రీ కాసుల బాలరాజు గారు, మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారు పాల్గొన్న స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు...

## శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



తాండూర్ మండల్ ఖంజాపూర్ గ్రామంలో శ్రీ మైసమ్మ దేవాలయం పునర్ నిర్మాణం చేసిన శుభ సందర్భంలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు శుక్రవారం శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని తాండూర్ నియోజకవర్గం ప్రజలందరూ సంతోషాలతో, పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో, సంతోషంగా ఉండాలని పూజలు చేసిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఇట్టి పూజ కార్యక్రమ అనంతరం గ్రామ పెద్దలు మహేందర్ రెడ్డి గారిని శాలువాతో సన్మానించడం జరిగింది వారితో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు,రాజేశ్వర్ రెడ్డి,ఉ ప సర్పంచ్ హేమలత వీరేషం,చంద్రశేఖర్, శివ కుమార్, సర్పంచ్ రామ్ రెడ్డి, వెంకటయ్య, వీరేషం,మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది...

## C.M,s కప్-2026 మండల స్థాయి క్రీడా పోటీలలో వివేక విద్యా భారతి హైస్కూల్ ప్రభంజనం

- విద్యార్థులకు అభినందించిన పాఠశాల
- కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు,ప్రిన్సిపాల్ మహమూద్






**అమంగల్, జనవరి,30(సమయం న్యూస్) :** C.Ms కప్– 2026 మండల స్థాయి క్రీడా పోటీలలో వివేక విద్యా భారతి హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనంస్థానిక కోనాపూర్ గ్రామంలో నిర్వహించిన జ.వీ'ం కప్ 2026 మండల స్థాయి క్రీడా పోటీలలో వివేక విద్యా భారతి హై స్కూల్ విద్యార్థులు పాల్గొని వాలీబాల్ బాలికల విభాగంలో మొదటి స్థానంలో విజేతలుగా నిలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి , స్థానిక మండల ఎంఈవో పాండు గారు, 13 గ్రామాల సర్పంచులు, వివిధ గ్రామ ప్రజా ప్రతినిధులు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, మరియు గ్రామస్థులు గెలుపొందిన విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.అనంతరం ఎంపీడీఓ మరియు ఎంఈఓ పాఠశాల ప్రిన్సిపాల్ కు సన్మానించడం జరిగింది.

## గ్రామాలలో ఉన్నటువంటి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ క్రీడలు ఎంతో ఉపయోగకరం

- రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి.



**చేవెళ్ల జనవరి 30:( సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్తుకంగా నిర్వహించిన "సీఎం కప్ –2026" రెండో ఎడిషన్ రూరల్ టు గ్లోబల్ గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు అనే నినాదంతో నిర్వహించిన గేమ్స్ షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, విజేతలకు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేసిన రంగారెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి.గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, వీణా, మెమో, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, అశోక్, లావణ్య చెన్నయ్య, నవనీత స్వామి, శాంతమ్మ యాదయ్య పార్టీ నాయకులు మండల క్రీడాకారులు, వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు...

## కొడంగల్ లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా నినాదం.

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్



**కొడంగల్ మున్సిపల్, జనవరి,30(సమయం న్యూస్) :** ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా 12 వార్డులకు గాను,12 వార్డులు క్లీన్ స్వీప్ చేసుకొని 5 సంవత్సరాలు కనివిని ఎరుగని రీతిలో కొడంగల్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం గతం లో పని చేసిన అనుభవం ఉంది కాబట్టి అందరమూ కలిసి అభివృద్ధి పథంలో నడిపిస్తాంఎవ్వరు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీర్వాదంతో 75–80 ఏళ్ళ చరిత్రను కొడంగల్ తిరగరాయబోతుంది . మొన్న నే కొడంగల్ అప్పయ్య పల్లి లో కాలేజీలు పోయాయని పుకార్లు సృష్టించి,గందరగోళం నెలకొల్పే పరిస్థితి సృటించారు..కానీ ముఖ్య మంత్రి తో మాట్లాడి అగ్రికల్చర్ యూనివర్సిటీ తెచ్చుకున్నాం.హుస్సేన్ పూర్ 300 ఎకరాల భూ సేకరణకు దరఖాస్తు చేసుకున్నారు ఎలక్షన్లు అయిపోయిన వెంటనే భూ సేకరణ చేసి ఫ్యాక్టరీలు పెట్టేలా ఏర్పాట్లు చేస్తున్నాం.కస్తూర్ పల్లి లో సిమెంట్ ఫ్యాక్టరీ కూడా ప్రారంభం కాబోతుంది.. ప్రజలందరూ సహకరించి తప్పకుండా నన్ను గెలిపించండి.ముద్దప్ప. జగ్గప్ప, అందరం కలిసి మాట్లాడుకుని కొడంగల్ కు పట్టిన దరిద్రం పోవాలంటే మనమందరం ఇక తాటిపై నడిచి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మేము చర్చించుకున్నాం.. ఆ ప్రకారమే మున్సిపల్ ఎలక్షన్లో మా కార్యచరణ ఉండబోతుంది...ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి

- నిర్మాణాలలో ప్రగతి సాధించక పోతే చర్యలు
- అధికారులు పనితీరు మార్చుకోవాలి.




**నారాయణపేట, జనవరి,30(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకంపై అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హెచ్చరించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో జిల్లా వెనుకబడి ఉండటంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేసి వారం రోజుల్లో ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా చేయించాలని, అవసరమైతే ఒకటి రెండుసార్లు లబ్ధిదారులను కలిసి పనులు చేయించాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల లక్ష్య సాధన పై కలెక్టర్ అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపి వోలు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులతో మండలాల వారీగా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇండ్ల నిర్మాణాలలో దామరగిద్ద మండలం అత్యంత వెనుక బడి ఉండటంపై ఆ మండల ఎంపీడీవో ను సంజాయిషి అడిగారు. పద్ధతి మార్చుకోవాలని, పనితీరు మెరుగు పరచుకోవాలని తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలే కాకుండా ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వంద రోజుల పని కల్పించడంలో కూడా జిల్లా ప్రగతి మిగతా జిల్లాల కంటే చాలా వెనక బడి ఉందని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ఇకపై స్థానికంగానే ఉండాలని కరాఖండిగా తెలిపారు.ఇండ్ల నిర్మాణాలలో టార్గెట్ పూర్తి చేసిన గ్రామాల పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ అభినందించారు. టార్గెట్ ఎలా రీచ్ అయ్యారో ! మిగతా పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని సూచిం చారు.అలాగే జిల్లాలోని అన్ని గ్రామాలకు కొత్త సర్పంచులు వచ్చారని, వారితో సమన్వయం చేసుకుని పరిపాలనను ముందుకు సాగించాలని, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా కార్యదర్శులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు .గ్రామాలలో ఆస్తి పన్ను వసూళ్ల పై దృష్టి పెట్టాలని తెలిపారు. వారం రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, లక్ష్యసాధన పై దృష్టి పెట్టని వారిపై చర్యలు తీసుకుంటారని ఆమె స్పష్టం చేశారు. ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# బల్దియా ప్రధాన కార్యాలయం లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

- వివిధ ఛాంబర్ ల స్థితి గతుల పరిశీలన

**వరంగల్ జనవరి30( సమయం న్యూస్) :** బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు నక్కల గుట్ట సర్కిల్ కార్యాలయం లో. కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ లు నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రధాన కార్యాలయం లోని నూతన భవనం లోగల ఐసిసిసి, అకౌంట్స్ విభాగం, ఐ టి విభాగం,ఇంజనీరింగ్ విభాగం, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన దస్త్రాలు భద్రపరిచే గది, వెటర్నరీ విభాగం,పోస్ట్ ఆడిట్,హార్టికల్చర్ విభాగం, ఇంజనీరింగ్ రికార్డ్ సెక్షన్ ను సందర్శించి ఫైళ్ళ నిర్వహణ తీరును అడిగి కమిషనర్ తెలుసుకున్నారు. సందర్శన నేపథ్యం లో కమిషనర్ వివిధ విభాగాల గదుల స్థితి గతులు,ఆయా విభాగాల్లో పని చేసే సిబ్బంది నిర్వహించే విధుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో కమిషనర్ వెంట ఏం హెచ్ ఓ డా.రాజేష్ సూపరిండెంట్ ఆనంద్ తదితరులు ఉన్నారు.



## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం




**వరంగల్ జనవరి30( సమయం న్యూస్). :** పురపాలక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. 2వ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలు, ఎన్నికల ఖర్చుల నియంత్రణపై చర్చించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రేట్ చార్ట్ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో పార్టీ అభ్యర్థి లక్ష రూపాయల కంటే ఎక్కువ ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే చేసిన ప్రతి ఖర్చును లెక్కల రూపంలో నమోదు చేసి, సంబంధిత అధికారులకు సమర్పించాల్సిందిగా సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, డీపీవో కల్పన, బీఎస్పీ పార్టీ తరఫున హరిశంకర్, వైఎస్సార్సీపీ తరఫున రజినీకాంత్, బీఎస్పీ పార్టీ తరఫున అనిల్ కుమార్, ఏఐ ఎం ఐ ఎం నుండి సయ్యద్ ఫైజుల్లా, తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ తో ఎలక్షన్ సాధారణ అబ్జర్వర్ బేటి

మున్సపిల్ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన

ఏర్పాట్ల పై వివరించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ .



**జనగాం జనవరి30( సమయం న్యూస్) :** జనగావం జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ అబ్జర్వర్గా నియమితులైన తెలంగాణ భాషా, సాంస్కృతి శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి (ఐ.ఏ.ఎస్.,) శుక్రవారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తన ఛాంబర్లో భేటి అయ్యరు, పూల బోకేను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా లో జనగామ మున్సిపాలిటీ 30 వార్డులు, స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీలలో 18 వార్డుల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్ల పై సాధారణ అబ్జర్వర్కు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ వివరించారు.
ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు గ్రామపంచాయితీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన టీచర్లను, రెవెన్యూ, ఇజిఎస్ పనిచేస్తున్న అధికారు లను నియమించామని ఆయన తెలిపారు. ఎన్నికల నిబందనలు అనుగుణంగా పూర్తిస్థా యి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అబ్జర్వర్ వివరించారు. ఈ బేటిలో అదనపు కలెక్బర్ (స్ధానిక సంస్థలు) పింకేష్ కుమార్, జెడ్పీ సిఇఓ మాదురి షా , జనగామ మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్ ) మాతృనాయక్ , తదితరులు పాల్గొన్నారు.

## మహా జాతర లో సింగరేణి రెస్క్యూ సేవలు...



**మేడారం , జనవరి 30( సమయ్దం న్యూస్) :** మేడారం జాతర లో సమ్మక్క సారలమ్మ దర్శనార్థం రోజు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి తమ మొక్కలు చెల్లించుకుంటున్నారు.
ఈ నేపథ్యంలో జాతర లో సింగరేణి రెస్క్యూ సిబ్బంది అద్భుతమైన సేవలు అందిస్తున్నారు. సుమారు 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది మూడు బ్యాచులుగా విడిపోయి గద్దెల ప్రాంగణంలో భక్తులు విసిరిన కొబ్బరి చిప్పలు, బెల్లం ఉండలు తగిలి గాయాలపాలైన వారిని గద్దెల ప్రాంగణంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురైన భక్తులకు సహాయక చర్యలు అందిస్తూ వారిని ఆసుపత్రికి అంబులెన్స్ వద్దకు చేరుస్తున్నారు. ఈ సహాయక చర్యలు వలన భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది ప్రతి మేడారం జాతర కు సేవలు అందించడం అనవాయితీగా వస్తుందని రెస్క్యూ సిబ్బంది వారు తెలిపారు.

# పీటీ ఉష ఇంట తీవ్ర విషాదం.. భర్త శ్రీనివాస్ కన్నుమూత

## శుక్రవారం తెల్లవారుజామున హఠాన్మరణం.. కుప్పకూలిన కొద్దిసేపటికే మృతి

## ఉష విజయాల వెనుక ఉన్న నిశ్శబ్ద శక్తి ఆయనే: కన్నీటి పర్యంతమైన కుటుంబం

## ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జనవరి 30:** భారత క్రీడా దిగ్గజం, 'పరుగుల రాణి'గా పేరొందిన రాజ్యసభ సభ్యురాలు, భారత ఒలింపిక్ సంఘంఅధ్యక్షురాలు పి.టి. ఉష కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త, మాజీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వి. శ్రీనివాసన్ (67) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన హఠాన్మరణంతో క్రీడాలోకం దిగ్భ్రాంతికి గురైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున శ్రీనివాసన్ తన నివాసంలో ఉన్నట్టుండి అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. వైద్యపరంగా అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే పరిస్థితి చేజారిపోయిందని డాక్టర్లు తెలిపారు. పి.టి. ఉష, శ్రీనివాసన్ దంపతులకు 'ఉజ్వల్' అనే కుమారుడు ఉన్నారు. వి. శ్రీనివాసన్ మాజీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. పి.టి. ఉష క్రీడా ప్రస్థానంలోనే కాకుండా, ఆమె రాజకీయ ప్రయాణంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఉష సాధించిన అనేక విజయాల వెనుక ఆయన నిశ్శబ్ద శక్తిగా, బలమైన మద్దతుదారుగా నిలిచారు. ప్రతి అడుగులోనూ ఆమెకు అండగా ఉంటూ ప్రోత్సహించారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..

శ్రీనివాసన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో తన ఆలోచనలన్నీ ఉష కుటుంబం చుట్టూనే ఉన్నాయని, మరణించిన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా సంతాపం వ్యక్తం చేశారు. "పీటీ ఉష భర్త శ్రీనివాసన్ మృతి చాలా బాధాకరం. ఉషతో పాటు ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ కష్టకాలంలో దేవుడు ఆమెకు మనోధైర్యాన్ని ప్రసాదించాలి" అని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. క్రీడాకారులు, కోచ్‌లు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా పీటీ ఉషకు సానుభూతి తెలుపుతున్నారు.



# మాయమైన కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్.. ఫ్యాన్స్‌లో హైటెన్షన్!

### శుక్రవారం తెల్లవారుజామున ఘటన.. 6 గంటల పాటు సస్పెన్స్

### 'పేజ్ నాట్ అవైలబుల్' రావడంతో హ్యాక్ అయ్యిందేమోనని ఆందోళన

### ఎట్టకేలకు రీ-స్టోర్ కావడంతో ఊపిరి పీల్చుకున్న అభిమానులు

**ముంబై, జనవరి 30:** మైదానంలో తన ఆటతీరుతో, బయట తన స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న టీమిండియా స్టార్ క్రికెటర్ 'కింగ్' విరాట్ కోహ్లీ ఫ్యాన్స్‌కు శుక్రవారం ఉదయం పెద్ద షాక్ తగిలింది. ఆసియాలోనే అత్యధిక ఫాలోవర్లు (27 కోట్లకు పైగా) కలిగిన కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా (ఏజఊతీఫ్.ఎశీష్ట్రశ్రీఱ) అకస్మాత్తుగా మాయమవడంతో డిజిటల్ ప్రపంచంలో ఒక్కసారిగా కలకలం రేగింది. శుక్రవారం తెల్లవారుజామున అభిమానులు కోహ్లీ ప్రొఫైల్ చూసేందుకు ప్రయత్నించగా.. అది కనిపించకుండా పోయింది. స్క్రీన్ పై "ఈ పేజీ అందుబాటులో లేదు" అనే సందేశం రావడంతో ఫ్యాన్స్ గందరగోళానికి గురయ్యారు. ఇటీవలే న్యూజిలాండ్‌పై 124 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడి, ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్న తరుణంలో ఇలా జరగడం అభిమానులకు మింగుడు పడలేదు. అయితే, కోహ్లీ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా మాత్రం యాక్టివ్‌గానే ఉండటంతో ఏం జరుగుతుందో అర్థంకాక నెటిజన్లు జుట్టు పీక్కున్నారు.

### వైరల్ అయిన 'పెంగ్విన్' మీమ్..

భారీ స్థాయిలో హ్యాకింగ్ జరిగిందా? లేక విరాట్ కావాలనే సోషల్ మీడియాకు బ్రేక్ ఇచ్చాడా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువలా వచ్చాయి. ముఖ్యంగా ఎక్కడికో నడుచుకుంటూ వెళ్లిపోయే "నిహిలిస్ట్ పెంగ్విన్" మీమ్ విపరీతంగా వైరల్ అయ్యింది. కోహ్లీ కూడా ఇలాగే ఇంటర్నెట్ నుంచి దూరంగా వెళ్లిపోయాడంటూ నెటిజన్లు సెటైర్లు వేశారు.

### 6 గంటల తర్వాత..

సాంకేతిక లోపం లేదా భారీ ట్రాఫిక్ కారణంగా ఇలా జరిగి ఉండవచ్చని నిపుణులు అంచనా వేశారు. ఉత్కంఠకు తెరదించుతూ.. దాదాపు ఆరు గంటల తర్వాత విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తిరిగి పునరుద్ధరించబడింది. ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినా, ఖాతా మళ్లీ కనిపించడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక వ్యక్తి సోషల్ మీడియా ఖాతా కొన్ని గంటలు కనిపించకపోతే ప్రపంచం మొత్తం గమనించిందంటే.. కోహ్లీ క్రేజ్ ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

# ముంబై 'మహారాణి' పోరాటం వృథా

### హర్మన్‌ప్రీత్ (82) వీరోచిత ఇన్నింగ్స్ వృథా.. 11 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్ విజయం

### టైటిల్ రేసులో ముంబైకి గండం.. ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకున్న గుజరాత్



ఎలిమినేటర్‌కు గుజరాత్

ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన గార్డ్నర్, వరేహమ్

**వడోదర, జనవరి 30:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌కు గట్టి షాక్ తగిలింది. శుక్రవారం వడోదర వేదికగా జరిగిన కీలక పోరులో గుజరాత్ జెయింట్స్ 11 పరుగుల తేడాతో ముంబైని ఓడించి ప్లేఆఫ్స్ (ఎలిమినేటర్) బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ విజయంతో గుజరాత్ జెయింట్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని పదిలం చేసుకోగా, ముంబై ఇండియన్స్ భవితవ్యం ఇప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ ముంబైని గెలిపించలేకపోయింది.

### గార్డ్నర్, వరేహమ్ మెరుపులు..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఆరంభంలో ఓపెనర్ బెత్ మూనీ (5) నిరాశపరిచినా, అనుష్క శర్మ (33 బంతుల్లో 33), సోఫీ డివైన్ (25) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే అసలైన విధ్వంసం చివర్లో జరిగింది. కెప్టెన్ ఆష్లే గార్డ్నర్ (28 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), జార్జియా వరేహమ్ (26 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా చివరి 5 ఓవర్లలో గుజరాత్ ఏకంగా 61 పరుగులు రాబట్టింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 71 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

### ఒంటరి పోరాటం చేసిన హర్మన్‌ప్రీత్..

168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ హేలీ మాథ్యూస్ (6), నాట్ సీవర్-బ్రంట్ (2) విఫలమయ్యారు. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48 బంతుల్లో 82 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు సిక్సర్లతో విరుచుకుపడింది. కానీ ఆమెకు మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించలేదు. చివరికి ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 156 పరుగులు మాత్రమే చేయగలిగింది.

### గుజరాత్ బౌలర్ల మాయాజాలం..

గుజరాత్ బౌలర్లలో సోఫీ డివైన్, జార్జియా వరేహమ్ తలో రెండు వికెట్లు తీసి ముంబై నడ్డి విరిచారు. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన జార్జియా వరేహమ్, గార్డ్నర్ గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ గెలుపుతో గుజరాత్ జెయింట్స్ ఎలిమినేటర్ రౌండ్‌కు అర్హత సాధించగా, ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ ఆశలు ఆదివారం జరిగే ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ యూపీ వారియర్స్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉన్నాయి.

# దాయాదుల పోరుపై ఉత్కంఠ.. లంకలో హై అలర్ట్!

**స్పోర్ట్స్ డెస్క్, జనవరి 31:** ప్రస్తుతం టీమిండియా న్యూజిలాండ్‌తో, పాకిస్థాన్ ఆస్ట్రేలియాతో సిరీస్‌లు ఆడుతున్నా.. ప్రపంచ క్రికెట్ అభిమానుల చూపు మాత్రం ఫిబ్రవరిలో జరగబోయే టీ20 ప్రపంచకప్ పైనే ఉంది. ముఖ్యంగా ఫిబ్రవరి 15న శ్రీలంక వేదికగా జరగనున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ కోసం సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే రాజకీయ ఉద్రిక్తతలు, ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ మ్యాచ్ నిర్వహణను శ్రీలంక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారత్-పాక్ మ్యాచ్ సెన్సిటివిటీని, ఆటగాళ్ళ భద్రతను దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధికారులు 'హైయెస్ట్ ప్రయారిటీ' సెక్యూరిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు లంక క్రీడాశాఖ మంత్రి సునీల్ కుమార గమాగే కీలక ప్రకటన చేశారు. రెండు జట్లకు రక్షణ కల్పించేందుకు 'ఎలైట్ కమాండో' యూనిట్లను మోహరిస్తున్నట్లు తెలిపారు. జట్లు ఎయిర్‌పోర్ట్‌లో దిగిన క్షణం నుంచి.. తిరిగి దేశం విడిచి వెళ్లే వరకు 24 గంటల పాటు ఆర్మ్డ్ ప్రొటెక్షన్‌లో ఉంటారని స్పష్టం చేశారు.

### బంగ్లా అవుట్.. స్కాట్లాండ్ ఇన్

మరోవైపు ఈ ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ పూర్తిగా తప్పుకోవడం చర్చనీయాంశమైంది. తమ మ్యాచ్‌లను ఇండియాలో కాకుండా శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరగా.. చివరి నిమిషంలో వేదికల మార్పు కుదరదని ఐసీసీ తేల్చిచెప్పింది. కో-హోస్ట్ అయిన శ్రీలంక కూడా గ్రూప్ మార్పుకు అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ టోర్నీ నుంచి వైదొలగగా.. ఆ స్థానంలో స్కాట్లాండ్ జట్టుకు అవకాశం దక్కింది.

బంగ్లాదేశ్ వైదొలగడాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (ాజదీ) సీరియస్‌గా తీసుకుంది. బంగ్లాకు బహిరంగ మద్దతు ప్రకటించిన పాక్.. ఐసీసీ తీరుపై అసంతృప్తితో ఉంది. ఈ క్రమంలోనే భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే ఆలోచనలో పాకిస్థాన్ ఉన్నట్లు 'టెలికాం ఆసియా స్పోర్ట్' నివేదిక వెల్లడించింది.



- తొలి పోరులోనే భారత్‌తో ఢీ.. ముంబై వేదికగా బిగ్ ఫైట్
- ప్రతిభ ఆధారంగానే ఎంపిక: ఐసీసీ పర్యవేక్షణలో జట్టు ప్రకటన

# టీ20 ప్రపంచకప్‌కు అమెరికా సై.. కెప్టెన్‌గా మనోడే!

### పాత జట్టుపైనే నమ్మకం.. 10 మందికి మళ్లీ ఛాన్స్

**స్పోర్ట్స్ డెస్క్, జనవరి 31 :** మరో వారం రోజుల్లో (ఫిబ్రవరి 7 నుంచి) భారత్, శ్రీలంక వేదికలుగా ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ సమరానికి అగ్రరాజ్యం అమెరికా (ఖూూ) సిద్ధమైంది. మరోసారి ప్రపంచ వేదికపై సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్న యూఎస్ఏ.. తాజాగా తమ జట్టును ప్రకటించింది. విశేషమేమిటంటే.. గత ప్రపంచకప్‌లో ఆడిన వారిలో ఏకంగా 10 మందికి ఈసారి కూడా చోటు కల్పించి, అనుభవానికే పెద్దపీట వేసింది.

### సారథిగా గుజరాతీ బిడ్డ..

అమెరికా జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన మోనాంక్ పటేల్ భారతీయ సంతతికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. గుజరాత్‌లో జన్మించిన మోనాంక్.. 2019లో వికెట్ కీపర్‌గా అమెరికా జట్టులో అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి జట్టు వృద్ధిలో కీలక పాత్ర పోషించారు. 2024 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై సంచలన విజయం సాధించి, జట్టును సూపర్-8 దశకు చేర్చడంలో ఆయన నాయకత్వం కీలకం.

### తొలి మ్యాచ్‌లోనే అగ్నిపరీక్ష

ఈ ప్రపంచకప్‌లో అమెరికాకు ఆరంభమే అగ్నిపరీక్ష ఎదురుకానుంది. ముంబై వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లోనే ఆతిథ్య దేశం, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన టీమిండియాతో అమెరికా తలపడనుంది. గత ఏడాది పాక్‌కు షాకిచ్చిన అమెరికా.. ఈసారి సొంతగడ్డపై భారత్‌ను ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది.

### నిషేధం నీడలో.. పకడ్బందీ ఎంపిక

ఐసీసీ నిబంధనల ఉల్లంఘన కారణంగా గత సెప్టెంబర్‌లో యూఎస్ఏ క్రికెట్‌పై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టు ఎంపికపై ఐసీసీ, యూఎస్ ఒలింపిక్ కమిటీ ప్రత్యేక దృష్టి సారించాయి. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా, కేవలం ప్రతిభ ఆధారంగానే పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.



### అమెరికా జట్టు వివరాలు

మోనాంక్ పటేల్ (కెప్టెన్), జెస్సీ సింగ్ (వైస్ కెప్టెన్), ఆండ్రీస్ గౌస్, షెహాన్ జయసూర్య, మిలింద్ కుమార్, షయన్ జహంగీర్, సాయితేజ ముక్కామల, సంజయ్ కృష్ణమూర్తి, హర్మీత్ సింగ్, నోస్తుష్ కెంజిగే, షాడ్లీ వాన్ షాల్క్‌విక్, సౌరభ్ నేత్రవల్కర్, మహ్మద్ మొహసిన్, శుభమ్ రంజనే తదితరులు.

## ప్రతి ఇంట్లో కనిపించే కథ..
# ‘ఓం శాంతి శాంతి శాంతిః’



‘ఓం శాంతి శాంతి శాంతిః’ మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహేకి రీమేక్ ఇది.


బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలనీ భవిష్యత్తు గురించి చిన్నప్పట్నుంచీ ఎన్నో కలలు కన్న ఓ సగటు యువతి ప్రశాంతి అలియాస్ శాంతి (ఈషా రెబ్బా). కళాశాలలో జరిగిన ఓ సంఘటనతో చదువును అర్ధాంతరంగా ఆపేసి పెళ్లికి తలూపాల్సి వస్తుంది. కట్టుకున్న అమ్మాయిని తాను చదివిస్తానని మాట ఇచ్చి మరీ శాంతిని పెళ్లి చేసుకుంటాడు చేపల వ్యాపారి ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్). పెళ్లి తర్వాతైనా చదువుకోవచ్చనే సంతోషంతో నాయుడుతో కలిసి ఏడడుగులు వేస్తుంది. కానీ, ఆమె ఊహించింది ఒకటి, పెళ్లి తర్వాత జరిగింది మరొకటి. భర్త అనే అహంకారంతో తన కోపాన్నంతా భార్య శాంతిపై ప్రదర్శిస్తుంటాడు ఓంకార్. ఆయనకు కోపం వచ్చిందంటే భార్య చెంప పగిలిపోవల్సిందే. ఇదే విషయాన్ని కన్నవాళ్లతో చెబితే సర్దుకుపోవాలంటూ చెబుతారు. రోజు రోజుకీ భర్త పెట్టే హింస శ్రుతిమించడంతో ఒక రోజు శాంతి ఎదురు తిరుగుతుంది. తానూ చేయి చేసుకోగలననీ భర్తకు బాగా తెలిసేలా చేస్తుంది. దాంతో కంగుతిన్న ఓంకార్ ఏం చేశాడు? ఆ తర్వాత భార్యాభర్తల మధ్య యుద్ధం ఎలా సాగింది? ఇద్దరూ విడిపోయారా? లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటినీ ఆలోచింపజేసే బలమైన కథ ఇది. ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తనని తాను చూసుకునే శాంతి పాత్ర ఇందులో ఉంది. ఓంకార్ నాయుడులా అహంకారం, ఆవేశంతో భార్యలపై చేయి చేసుకున్న మగాళ్లు ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలామందే గుర్తుకొస్తారు. గోదావరి నేపథ్యాన్ని జోడించడమే ఈ సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగుదనం ఉట్టిపడే పాత్రలు, గోదావరి యాస ఈ సినిమాని సొంతం చేసుకునేలా చేస్తాయి. అచ్చమైన గోదావరి ప్రాంతం నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. కట్టుబాట్ల పేరుతో అమ్మాయిల స్వేచ్ఛని, వాళ్ల హక్కుల్ని హరించి వేస్తున్నామని చెప్పకనే చెబుతాయి ఆ సన్నివేశాలు. ఓంకార్ నాయుడు పాత్ర పరిచయం తర్వాత సన్నివేశాలు సరదా సరదాగా మారిపోతాయి. బ్రహ్మాజీ నేపథ్యంలోని సన్నివేశాలు మరింత సందడిగా సాగుతాయి. శాంతి పాత్ర మెట్టినింట్లోకి అడుగుపెట్టాక అక్కడ ఆమెకి ఎదురయ్యే పరిణామాలు చాలా ఇళ్లల్లో చోటు చేసుకునే గృహ హింసకు అద్దం పట్టేలా ఉంటాయి. శాంతి ఎదురు తిరగడంతోనే కథ మలుపు తిరుగుతుంది. అక్కడ మొదలైన భార్యాభర్తల మధ్య యుద్ధం ఎక్కడ ముగిసిందన్నదే మిగతా సినిమా. ద్వితీయార్ధం తర్వాత ఆ ఇద్దరి మధ్య సాగే కొన్ని సన్నివేశాలు పునరావృతం అయినట్టుగా అనిపిస్తాయి. ఓంకార్ నాయుడు పాత్రలో తరుణ్ భాస్కర్ ఒదిగిపోయిన తీరు మెప్పిస్తుంది. ఆయన గోదావరి యాస పలికిన విధానం కూడా బాగుంది. భార్య తిరగబడేంత వరకూ ఒకలా కనిపించిన తరుణ్, భార్య చేతిలో తన్నులు తినప్పట్నుంచి ఆయన ప్రదర్శించిన నటన, హావభావాలు మరో స్థాయిలో ఉంటాయి. శాంతి పాత్రలో ఈషా రెబ్బా నటన ఈ సినిమాకి హైలైట్. ప్రథమార్ధంలో కళ్లతోనే భావాలు పలికిస్తూ పాత్రని పండించింది. భర్తని ఎదిరిస్తూ చేసే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. బ్రహ్మాజీతోపాటు ఇతర నటులు పాత్రల పరిధి మేరకు మంచి అభినయం ప్రదర్శించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. దర్శకుడు గోదావరి నేపథ్యాన్ని తెరపై చూపిస్తూ కథని చెప్పిన తీరు, నందకిశోర్ సంభాషణలు ఆకట్టుకునేలా ఉంటాయి.

# అమెజాన్‌లోకి వస్తున్న నారీ నారీ నడుమ మురారి’

సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి' ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఫిబ్రవరి 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్ , హీరోయిన్లుగా సాక్షీ వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు. బీటెక్ చేసి ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్న కుర్రాడు గౌతమ్ (శర్వానంద్). నిత్య (సాక్షి వైద్య)తో ప్రేమలో ఉన్న తను.. ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి పీటలెక్కాలని అనుకుంటాడు. ఈ పెళ్లికి తొలుత నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) అడ్డు చెప్పినా.. తర్వాత అంగీకరిస్తాడు. ఆ పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లో జరగాలని షరతు పెడతాడు. తప్పని పరిస్థితుల్లో దీనికి గౌతమ్ ఓకే అంటాడు. అలా పెళ్లికి దరఖాస్తు చేసుకున్నాక గౌతమ్‌కు ఓ అనుకోని చిక్కు ఎదురవుతుంది. దానికి, కాలేజీలో ప్రేమించిన దియా (సంయుక్త)కు ఉన్న సంబంధం ఏంటి? అసలు వాళ్లిద్దరూ ఎందుకు విడిపోవాల్సి వచ్చింది? ఈ రెండు ప్రేమకథల వల్ల గౌతమ్ తండ్రి కార్తీక్ (నరేశ్) – పిన్ని పల్లవి (సిరి హనుమంతు)ల దాంపత్య జీవితం విడాకుల దాకా ఎందుకు వెళ్లింది? అన్నది మిగతా కథ.





## తెల్ల చీరలో హీట్ పుట్టిస్తున్న
# అనైరా గుప్తా

ఇండియన్ సినిమాల్లో క్రమంగా గుర్తింపు పెంచుకుంటున్న నటి, మోడల్ అనైరా గుప్తా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తాజాగా షేర్ చేసిన ఫోటోకు మంచి స్పందన లభిస్తోంది. తెల్ల చీరకు ఎరుపు ప్రింటెడ్ బ్లౌజ్‌ను జోడించిన లుక్‌లో అనైరా ఆకట్టుకుంటోంది. తమిళ, తెలుగు చిత్రాల్లో నటిస్తూ అనైరా తనదైన గుర్తింపును ఏర్పరుచుకుంది. థలపతి విజయ్‌తో కలిసి నటించిన ‘సర్కార్’ చిత్రం ఆమెకు విస్తృత గుర్తింపు తీసుకొచ్చింది. అలాగే ‘వితైక్కారన్’ తమిళ సినిమాలోనూ ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తెలుగులో ‘అన్వేషి’తో మెప్పించిన అనైరా, తాజాగా హరీష్ గాధగాని దర్శకత్వంలో తెరకెక్కిన రొమాంటిక్ లవ్ స్టోరీ ‘హవీఎ’లోనూ నటించింది. సినిమాలతో పాటు, 2026లో విడుదలైన ‘మజా లే లే’ మ్యూజిక్ వీడియోలో పూనమ్ ఝా, దేవ్ నేగితో కలిసి కనిపించి మరోసారి వార్తల్లో నిలిచింది.

# రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ

## జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?



ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

# పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ



టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది.పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళిధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.

# జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷–లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131